

నాలుగేళ్ల కిందటి హత్య కేసును ఛేదించిన పోలీసులు


- రౌడీ షీటర్ గనగళ్ల శ్రీను మర్డర్ కేసులో ఇద్దరి అరెస్టు

నాలుగేళ్ల కిందట జరిగిన రౌడీషీటర్ హత్య కేసును నగర పోలీసులు ఛేదించారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేశారు -6లో



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

బెట్టింగ్ భూతం



రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగులు

- ఆ ఊబిలో దిగితే అంతేసంగతులు
- జీవితాలు నాశనం
- ఐపీఎల్ ప్రారంభంతో మళ్లీ యాక్టివ్ కానున్న మాఫియా
- పిల్లలపై ఒక కన్నేసి ఉంచాల్సిందే
- వీలైనంత వరకూ సాయంత్రం వేళల్లో ఇంట్లో ఉండేలా చూడాలని సైకాలజిస్టుల సూచన

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):

ఎంవీపీ కాలనీకి చెందిన ఐటీ ఉద్యోగి కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. గడిచిన కొద్దినెలలుగా సెల్‌ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ కాయడం అలవాటు చేసుకున్నాడు. మొదట తల్లిదండ్రులు ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులు కాసేవాడు. తరువాత స్నేహితులు, బంధువుల వద్ద అప్పులు చేశాడు. ఆఖరికి ఇంట్లో ఉన్న డబ్బులు, తన తండ్రికి తెలియకుండా ఆయన అకౌంట్‌లో ఉన్న డబ్బులు కూడా లాగేసి బెట్టింగ్ కాశాడు. విషయం తల్లిదండ్రులకు తెలిసేసరికి రూ.15 లక్షల వరకూ పోగొట్టాడు. అప్పటికే బెట్టింగ్ వ్యసనానికి బానిసైనట్టు గుర్తించిన తల్లిదండ్రులు కుమారుడికి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు.

నగరానికి చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి స్నేహితుడి ద్వారా బెట్టింగ్ అలవాటైంది. మొదట్లో జీతం, ఆ తరువాత అప్పులు చేసి బెట్టింగ్ కాశాడు. భారీగా అప్పులు పెరిగిపోవడంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. అప్పటికే తీవ్రమైన కుంగుబాటుకు గురైన కుమారుడి విషయం తెలుసుకున్న స్టీల్‌ప్లాంటులో పనిచేసే అతని తండ్రి కొన్ని ఆస్తులు అమ్మి అప్పులు తీర్చాడు. సదరు యువకుడు మొత్తం కోటి రూపాయలకుపైగా బెట్టింగ్‌లో నష్టపోయాడు.

గాజువాక ప్రాంతానికి చెందిన ఒక విద్యార్థి బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. మొదట్లో తల్లిదండ్రులు ఖర్చులకు ఇచ్చిన డబ్బులు బెట్టింగ్ కాసేవాడు. ఆ తరువాత అప్పులు చేశాడు. విషయం తల్లిదండ్రులకు తెలిసేసరికి ఐదు లక్షల రూపాయల వరకూ బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు.

క్రికెట్ బెట్టింగ్ జీవితాలను నాశనం చేస్తోంది. ఎంతోమంది ఈ ఊబిలోకి దిగి లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకూ అన్ని వర్గాలు, వయసులకు చెందినవారు ఈ బెట్టింగ్‌కు అలవాటుపడుతున్నారు. బెట్టింగ్ మాఫియాకు ఐపీఎల్ అతిపెద్ద పండుగని చెప్పాలి. ఒక్కో ఐపీఎల్ మ్యాచ్‌పై వేల కోట్ల రూపాయల బెట్టింగ్ జరుగుతుంది. అందుకే ఐపీఎల్ కోసం బెట్టింగ్ మాఫియా వేయి కళ్లతో ఎదురుచూస్తుంటుంది.

యాప్‌లతో సర్వనాశనం

బెట్టింగ్ రెండు రకాలుగా కాస్తుంటారు. బుకీల ద్వారా బెట్టింగ్ వేసేవాళ్లు ఒకరకం. బుకీ ఎక్కడో ఉంటాడు. అతనితో బెట్టింగ్ ఫోన్‌ల ద్వారా వేస్తారు. ఒకవేళ బుకీ ఫోన్‌కు స్పందించకపోయినా, అతను పోలీసులకు దొరికినా డబ్బులు రావు. రెండో రకం బెట్టింగ్ యాప్స్ ఇవి అత్యత ప్రమాదకరమైనవి. ప్రస్తుతం మార్కెట్‌లో 20కుపైగా బెట్టింగ్ యాప్స్ ప్రచారంలో ఉన్నాయి. వివిధ రకాల ఆఫర్లు, బోనస్‌ల పేరిట యువతను ఈ యాప్స్ ఆకట్టుకుంటున్నాయి. ఒకసారి ఈ యాప్స్‌ను వినియోగిస్తే బయటకు రావడం అంత తేలికకాదు. వివిధ రకాల పేమెంట్ యాప్స్ నుంచి నేరుగా ఆయా అకౌంట్లలోకి డబ్బులు జమ చేసి...క్షణాల్లో బెట్టింగ్ వేసుకునే వెసులుబాటు ఉండడంతో ఎంతోమంది విద్యార్థులు, ఉద్యోగులు రూ.లక్షల్లో నష్టపోయి ప్రాణాలను తీసుకునే వరకూ వెళుతున్నారని సైకాలజిస్టులు చెబుతున్నారు. బెట్టింగ్ వల్ల నష్టపోయిన వాళ్లే తప్ప...లాభపడిన వాళ్లు ఒక్కరు కూడా కనిపించరు.

కుటుంబ సభ్యుల బాధ్యత..

బెట్టింగ్‌కు దూరంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులదేనని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు ఈ రెండు నెలలపాటు ఇంటికి దూరంగా వెళ్లకుండా చూడాలి. ఒకవేళ వెళ్లినా రాత్రి ఇంటికి వచ్చేలా జాగ్రత్తపడాలి. వారికి ప్రత్యేక గదులు ఇవ్వకుండా అందరూ కలిసి ఉండడం మంచిది. అకౌంట్లలో భారీ మొత్తాలు లేకుండా చూసుకోవాలి. పిల్లల అకౌంట్లలో డబ్బులు లేకుండా చూసుకోవడం అత్యంత కీలకం. వారి ఫోన్లలో ... మిగతా 6వ పేజీలో

వేడెక్కిన గ్రేటర్ రాజకీయం

మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి కూటమి నోటీస్

70 మంది కార్పొరేటర్ల సంతకాలతో కలెక్టర్‌కు అందజేత



కలెక్టర్‌కు నోటీసు అందజేసేందుకు వచ్చిన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కూటమి కార్పొరేటర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ రాజకీయం వేడెక్కింది. జీవీఎంసీ ఎన్నికల్లో అత్యధిక వార్డులను గెలుచుకుని మేయర్, రెండు డిప్యూటీ మేయర్ పదవులను దక్కించుకున్న వైసీపీ బలం 2024 సాధారణ ఎన్నికల తర్వాత తగ్గుతూ వచ్చింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలం పెరిగింది. ఈ నేపథ్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు శనివారం కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు, కార్పొరేటర్లు నోటీస్ అందజేశారు. దీంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో ఏం జరుగుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి పెరిగింది.

- వచ్చే నెల మొదటి వారంలో కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం
- మేయర్ మార్పు ఇక లాంఛనమే?
- కొత్త మేయర్, డిప్యూటీ మేయర్ పోస్టులపై జోరుగా చర్చ
- జీవీఎంసీలో మారుతున్న సమీకరణాలపై సర్వత్రా ఆసక్తి

జీవీఎంసీకి 2020 మార్చిలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 98 వార్డులకుగాను వైసీపీ 59 వార్డులను గెలుచుకుంది. ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురు వైసీపీకి మద్దతు ప్రకటించడంతో కౌన్సిల్‌లో వైసీపీకి తిరుగులేకుండా పోయింది. ఈ క్రమంలోనే మూడుసార్లు జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పదికి పది స్థానాలను వైసీపీ గెలుచుకుంది. 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారం దక్కించుకోవడంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో సమీకరణాలు మారిపోయాయి. వైసీపీకి మద్దతు ప్రకటించిన నలుగురు కార్పొరేటర్లలో ఇద్దరు టీడీపీ, మరో ఇద్దరు జనసేనలో చేరారు. వైసీపీ నుంచి 21వ వార్డు కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలిచిన వంశీకృష్ణశ్రీనివాస్ ఎమ్మెల్సీ (ప్రస్తుతం ఆయన జనసేన ఎమ్మెల్యేగా ఉన్నారు)గా ఎంపికవ్వడంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేయగా, ఆ స్థానానికి ఇంతవరకూ ఎన్నిక జరగలేదు. మిగిలిన 58 మంది కార్పొరేటర్లలో దాదాపు 31 మంది టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరిపోయారు. దీంతో వైసీపీ బలం 27కి తగ్గిపోగా, కూటమి బలం 70కి పెరిగింది. వీరు కాకుండా ఎక్స్‌అఫిషియో సభ్యులుగా కౌన్సిల్‌లో ఓటు హక్కు కలిగిన ఎమ్మెల్యేలు ఎనిమిది మంది, ఎంపీలు ఇద్దరు, ఎమ్మెల్సీ ఒకరు కూటమికి ఉన్నారు. ప్రస్తుతం కూటమి సభ్యుల సంఖ్య 81కి పెరిగింది.

కౌన్సిల్‌లో తగినంత మెజారిటీ ఉండడంతో వైసీపీకి చెందిన మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానం పెట్టాని నిర్ణయానికి వచ్చారు. అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడానికి సగం కంటే ... మిగతా 6వ పేజీలో

కైలాసగిరి అభివృద్ధికి ప్రణాళిక

పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో ప్రాజెక్టులు



- టెక్నికల్ కన్సల్టెంట్ కోసం ప్రకటన జారీ
- 2019లోనే మాస్టర్ ప్లాన్ తయారీ..
- ప్రపంచ బ్యాంకు నిధులు ఆగిపోవడంతో ముందుకుసాగని పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కైలాసగిరిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పర్యాటక కేంద్రంగా మరింత విస్తరించాలని, కొత్త కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ యత్నిస్తోంది. దీనిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో చేపట్టనున్నారు. దీనిపై ప్రణాళిక రూపొందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వారు ముందుకు రావాలని ప్రకటన జారీచేసింది.

హుద్‌హుద్ (2014) తుపాన్‌కు కైలాసగిరి బాగా దెబ్బతింది. దీని పునర్నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు ముందుకువచ్చింది. దీనికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుచేశారు. కైలాసగిరి విస్తీర్ణం మొత్తం 380 ఎకరాలు కాగా అందులో 90 ఎకరాలను అభివృద్ధి చేయడానికి రూ.56 కోట్లతో ప్రణాళిక రూపొందించి పంపించారు. కైలాసగిరిపై భద్రత పెంచాలని, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కిందనున్న ప్రధాన ప్రవేశద్వారం శివాలయం దగ్గర నుంచి తెలుగు మ్యూజియం వరకు, అటు హనుమంతవాక మెట్ల మార్గం, ఇటు రోప్‌వే వైపు 120 సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. శంఖు చక్రాల దగ్గరున్న భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి దానికి అనుసంధానం చేయాలనుకున్నారు. పర్యాటకులు వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి అదనంగా శివాలయం దగ్గర ఒకటి, తెలుగు మ్యూజియం దగ్గర మరో పార్కింగ్ సౌకర్యం కల్పించాలనుకున్నారు. మ్యూజియం దగ్గరకు నేరుగా కార్లు, బస్సులతో వెళ్లిపోయేలా ప్రత్యామ్నాయంగా వేసిన రహదారిని అభివృద్ధి చేద్దామనుకున్నారు. చుట్టూ సోలార్ ఫెన్సింగ్, స్కై టవర్, జిప్ లైనర్, జోర్బింగ్, అడ్వెంచర్ గేమ్స్ వంటివి ఏర్పాటుచేస్తామని ప్రతిపాదించారు. అయితే పనులు సరిగ్గా నిర్వహించకపోవడం, నిధులు వేరే వాటికి మళ్లించడంతో ప్రపంచ బ్యాంకు రూ.13 కోట్లు మాత్రమే ఇచ్చి,మిగిలిన మొత్తం ఆపేసింది. దాంతో చేయాలనుకున్న పనులు ఆగిపోయాయి.

కొన్ని అందుబాటులోకి...

ప్రపంచ బ్యాంకు నిధులు రావని ... మిగతా 6వ పేజీలో

ఉక్కుపై కొరవడిన స్పష్టత

ఎంపీల ప్రశ్నలకు మంత్రిత్వ శాఖ కప్పదాటు సమాధానాలు

- బ్యాంకుల అప్పులు తీర్చడానికి, పెద్ద పెద్ద సంస్థల బకాయిలు చెల్లించడానికి ప్యాకేజీ మొత్తం వినియోగం
- జీతం బకాయిలు చెల్లించరా?... అంటే...జవాబు శూన్యం
- ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో కొనసాగుతున్న అనిశ్చితిపై కేంద్రం సరైన సమాధానం ఇవ్వడం లేదు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్లాంటు సక్రమంగా నడవడానికి రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇచ్చినా, ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు. ఫిబ్రవరి నెలాఖరుకు 205 శాతం జీతాల బకాయి ఉంది. ఇంకో వారం రోజులు ఆగితే మూడు నెలల జీతం చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో ప్రశ్నలు సంధించినా వాటికి సూటిగా స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు.

కేంద్రం అందించిన ఆర్థిక ప్యాకేజీ మొత్తాన్ని బ్యాంకుల అప్పులు తీర్చడానికి, పెద్ద పెద్ద ... మిగతా 6వ పేజీలో



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,500వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రాత్రి అఖిలపక్ష కార్మిక సంఘాల పర్యవేక్షణలో ఉద్యోగులు, కార్మికులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

నేడు పాదయాత్ర

- గాజువాక నుంచి కూర్మన్నపాలెంలోని శిబిరం వరకు..
- కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

గాజువాక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉపాధి రక్షణ యాత్ర పేరుతో ఆదివారం పాదయాత్ర చేపట్టనున్నట్టు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు కొత్త గాజువాకలో పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పాత గాజువాక, చినగంట్యాడ, శ్రీనగర్, వడ్లపూడి మీదుగా కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వరకు పాదయాత్ర సాగుతుందని పేర్కొన్నారు.

శారదా పీఠంలో నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ ఆరా

- అనుమతులకు సంబంధించిన పత్రాలు సేకరణ



పెందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):

చినముషిడివాడలోని శారదా పీఠంలో చేపట్టిన నిర్మాణాలపై జీవీఎంసీ పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) విభాగం శనివారం ఆరా తీసింది. నగర సిటీ ప్లానర్ మీనాకుమారి నేతృత్వంలో ఎనిమిదో జోన్ ఏసీపీ రామలింగేశ్వర రెడ్డి, టీపీవో గోపన్న పీఠానికి వెళ్లి నిర్మాణాలకు అనుమతులపై నిర్వాహకులతో మాట్లాడారు. 'పీఠం వెనుక మోసం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఇప్పటికే పెందుర్తి తహసీల్దార్ ఆనంద్ కుమార్ నేతృత్వంలో సర్వే ప్రారంభించారు. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పీఠంలో అక్రమ నిర్మాణాలపై దృష్టిసారించారు. చినముషిడివాడ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి జీవీఎంసీలో విలీనమయ్యేంత వరకూ పీఠంలో చేపట్టిన నిర్మాణాలపై సిటీ ప్లానర్ మీనాకుమారి ఆరా తీసినట్టు తెలిసింది.నిర్వాహకులు కొన్ని డాక్యుమెంట్లు అందజేశారు. నిర్మాణాలకు అనుమతులు, ఇతర అంశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు తుది నివేదిక అందజేయనున్నామని ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి తెలిపారు.

ఐపీఎల్ సందడి



కేఎల్ రాహుల్ నెట్ ప్రాక్టీస్



రిషబ్ పంత్ బ్యాటింగ్ ప్రాక్టీస్

నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో సోమవారం తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఆటగాళ్లు శనివారం మధ్యాహ్నం ముమ్మర సాధన చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్‌లోని కీలక ఆటగాడు కేఎల్ రాహుల్, ఇతర ఆటగాళ్లు, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌తోపాటు డేవిడ్ మిల్లర్, మిశ్చల్ మార్ష్, మయాంక్ యాదవ్, తదితరులు సాధన చేశారు. -8లో

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):

దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 23, 24 తేదీల్లో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 23న (ఆదివారం) గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239)ను, 24న విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), కాకినాడ-విశాఖ మెము పాసింజర్ (17267), విశాఖ-కాకినాడ మెము పాసింజర్ (17268), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (17286), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875), గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876)లను రద్దు చేశామని పేర్కొన్నారు. అలాగే 25న కూడా విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240) రద్దు చేశామని, ప్రయాణికులు గమనించాలన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.12 (ఆదివారం సాయంత్రం)

సహార్ : 4.42 (సోమవారం ఉదయం)

శిల్పారామం ఏఓ బదిలీ

మధురవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ శిల్పారామం పరిపాలనాధికారి టి. విశ్వనాథరెడ్డి వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పుట్టపర్తి శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డి నియమితులయ్యారు. విశ్వనాథరెడ్డి ఇక్కడ సుమారు ఏడేళ్లు పని చేశారు.

అర్హులందరికీ రుణాలు

కొమ్మాది, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు అందించనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ఆరో వార్డులో బీసీ రుణాలపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. బీసీలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి, వ్యాపారాలు నిర్వహించుకోవడానికి రుణాలు మంజూరు చేస్తామన్నారు అలాగే మహిళలకు కుట్టులో శిక్షణ ఇచ్చి, మెషన్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ సుభానీ, సీఈఓ పాపారావు, టీడీపీ నాయకులు లొడగల జానకీరామ్, గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, పోతిన రఘు, జనసేన నాయకులు అనురాధ పాల్గొన్నారు.

కిరాణా షాప్‌లో అగ్నిప్రమాదం

మధురవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గణేశ్‌నగర్‌లో ఉన్న కిరాణా షాప్‌లో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. యజమాని శ్రీధర్ శుక్రవారం రాత్రి దుకాణం మూసివేసి, ఇంటికి వెళ్లిపోయారు. దుకాణం నుంచి మంటలు రావడంతో స్థానికులు గుర్తించి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.

బోధనలో మార్పులు అవసరం

- అప్పుడే విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగు
- కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి

పద్మనాభం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బోధనలో మార్పులు వచ్చినప్పుడే విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెరుగుతుందని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ సంస్థ రాష్ట్ర కార్యదర్శి డి. దేవానందరెడ్డి తెలిపారు. శనివారం ఆయన పద్మనాభంలోని కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు తరచూ డిక్టేషన్ పెట్టడం వల్ల వారిలో లేఖన, భాషణ నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. చతుర్విధ ప్రక్రియలో సామర్థ్యాలను పెంచి చదవడం, రాయడం బాగా వచ్చేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. పది, ఇంటర్ విద్యార్థులను చదివించినట్లే, ఆరు నుంచి తొమ్మిదో తరగతి బాలికలకు కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ముందుచూపు కార్యక్రమం ద్వారా 9వ తరగతి విద్యార్థులకు పది పాఠ్యాంశాలను పరిచయం చేయాలన్నారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్, ఆర్‌జేడీ విజయభాస్కర్, ప్రిన్సిపాల్ గ్రేస్‌లిల్లీ పాల్గొన్నారు.



ఆనందపురంలో బాలికలకు స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్న కేజీబీవీ సెక్రటరీ దేవానంద రెడ్డి

ఆనందపురం : మండలంలోని ఎల్‌వీ పాలెం పంచాయతీ పరిధిలోని నేల్తేరు గ్రామంలో ఉన్న కేజీబీవీని కూడా దేవానందరెడ్డి సందర్శించారు. బాలికలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. అనంతరం నాంది ఫౌండేషన్ అందించిన స్పోర్ట్స్ కిట్లను బాలికలకు అందజేశారు. అలాగే బాలికలతో కలిసి భోజనం చేశారు. ఆయనతో పాటు ఆర్‌జేడీ విజయ భాస్కర్, ఏపీసీ చంద్రశేఖర్ ఉన్నారు.

చిల్లపేట చెరువు ఆక్రమణలు పరిశీలన

తగరపువలస, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, భీమిలి రహదారిని ఆనుకుని ఉన్న చిల్లపేట చెరు వు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించి, సర్వే చేపట్టారు. టీడీపీ కార్యదర్శి పిట్ట సురేశ్ ఫిర్యాదు మేరకు సర్వేయర్ రమేష్, చిట్టివలస వీఆర్‌ఓ శ్రీనివాసరావు సర్వే నిర్వహించారు. సర్వే నంబరు 24 లో 36.40 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువులో చాలావరకు ఆక్రమణలు జరిగాయని అధికారులు గుర్తించారు. ఆక్రమణల తొలగింపునకు కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల రామకృష్ణ, గిడుతూరి శ్రీనివాసరావు, తాటిపూడి అప్పలరాజు పాల్గొన్నారు.



ఆక్రమణలపై చర్చిస్తున్న అధికారులు

'రాము మృతి కళా రంగానికి తీరని లోటు'

కొమ్మాది, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా నాట్యమండలి కళాకారుడు పందరి రాము మృతి కళా రంగానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. శనివారం శివశక్తి నగర్‌లో రాము సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాము ప్రజా పక్షాన నిలిచి, పలు గీతాలు ఆలపించేవారన్నారు. కార్యక్రమంలో ఆర్‌కేఎ స్‌వీ కుమార్, నాగోతి సూర్యప్రకాశరావు, భారతి, కేశవయ్య, అప్పలరాజు పాల్గొన్నారు.

వేడెక్కిన గ్రేటర్ రాజకీయం

... 5వ పేజీ తరువాయి

ఎక్కువ మంది సభ్యుల బలం సరిపోయినా, తీర్మానం నెగ్గాలంటే మాత్రం కౌన్సిల్‌లో ఓటు హక్కు కలిగిన సభ్యుల్లో 2/3 వంతు మెజారిటీ తప్పనిసరి. కౌన్సిల్‌లో మొత్తం ఓటు హక్కు కలిగిన సభ్యులు 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు మొత్తం 111 మంది ఉండగా, వారిలో 2/3 వంతు అంటే 74 మంది సభ్యులు అవసరం అవుతారు.కూటమికి ఇప్పటికే సుమారు 81 మంది సభ్యుల బలం ఉండడంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు నోటీస్ అందజేశారు. నోటీసుపై ఉన్న సంతకాలు సభ్యులవేనా?, కాదా? అని నిర్ధారించుకున్న తర్వాత, అవిశ్వాస తీర్మానంపై చర్చకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు తేదీని నిర్ణయించి సభ్యులకు నోటీసులు జారీచేస్తారు. ఇప్పటికి ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని, పదవి నుంచి గొలగాని హరివెంకటకుమారి వైదొలగడం లాంఛనమేనని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలావుండగా మేయర్ పదవికి కూటమి నుంచి ఎవరు పోటీలో ఉంటారనే దానితోపాటు డిప్యూటీ మేయర్లుగా ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టీడీపీ ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరిస్తున్న పీలా శ్రీనివాస్‌ను 2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల సమయంలోనే మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. టీడీపీకి తక్కువ సీట్లు రావడంతో ఆయనకు ఫ్లోర్‌లీడర్ పదవిని అప్పగించారు. ఇప్పుడు కూటమికి మేయర్ పీఠం దక్కితే పీలా శ్రీనివాస్‌కే అవకాశం ఇస్తారని అంటున్నారు. అయితే బీసీ మహిళను మేయర్ పీఠం నుంచి దింపితే తిరిగి బీసీ మహిళకే పదవి కట్టబెట్టడం ద్వారా విమర్శలకు అవకాశం లేకుండా చేయవచ్చునని కొందరు కూటమి ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నట్టు సమాచారం. మరోవైపు డిప్యూటీ మేయర్ పదవులు రెండు ఉండడంతో ఒకటి జనసేనకు, రెండోది టీడీపీకి కేటాయించే అవకాశం ఉంది. అయితే బీజేపీ కూడా డిప్యూటీ మేయర్ కోసం పోటీ పడితే పరిస్థితి రసవత్తరంగా మారే అవకాశం ఉంటుంది. జీవీఎంసీలో రాజకీయం వేడెక్కడంతో కౌన్సిల్‌లో ఏం జరుగుందనే దానిపై సర్వత్రా ఆసక్తి పెరిగిందని చెప్పుకోవాలి.

కైలాసగిరి అభివృద్ధికి ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

అర్థమయ్యాక పీపీపీలో జిప్‌లైనర్, స్కై- స్లైకింగ్ ఏర్పాటుచేశారు. అలాగే గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం కూడా జరుగుతోంది. తెలుగు మ్యూజియానికి వెళ్లే మార్గం పూర్తికాలేదు. పార్కింగ్ సదుపాయాలు అదనంగా ఏర్పాటు చేయలేదు. కొన్ని సీసీ టీవీ కెమెరాలు పెట్టారు. అయితే ఉన్న వాటిలో చాలావరకూ సరైన నిర్వహణ లేక మూలకుచేరుతున్నాయి. ఇటీవల సర్క్యులర్ రైలు తరచూ మొరాయిస్తుండడంతో పూర్తిగా నిలిపేశారు. రోప్‌వే వద్ద అగ్ని ప్రమాదం జరిగిందని తాత్కాలికంగా ఆపేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తెస్తేనే పునరుద్ధరిస్తామని స్పష్టంచేశారు. బ్యాటరీ కార్లకు అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారని వాటిని ఆపేశారు. ఇప్పుడు కైలాసగిరిపైకి ఎవరైనా వెళితే...380 ఎకరాలను కాలినడకనే తిరగాలి. ఎటువంటి వాహన సదుపాయం లేదు.

పాత ప్లాన్లకు కొత్త కలరింగ్

వీఎంఆర్‌డీఏ ఏదైనా మాస్టర్ ప్లాన్, ఇతర అభివృద్ధి పనులకు టెండర్లు పిలిస్తే గతంలో పనిచేసిన కన్సల్టెన్సీలు వారి వద్ద అప్పటికే ఉన్న సమాచారంతో కొత్త లెక్కలు వేసి లక్షలాది రూపాయలు కన్సల్టెన్సీ ఫీజులు కింద తీసుకుంటున్నాయి. లీ అసోసియేట్స్ వంటి సంస్థలను ఇక్కడి అధికారులు ఆపినా వారు అమరావతి వెళ్లి అక్కడి నుంచి చెప్పించుకొని కొనసాగుతున్నారు. ఇప్పుడు కూడా అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పాత డీపీఆర్‌ను ఒకసారి చూసి, అవసరమైన మార్పులు చేసుకొని ముందుకు వెళితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉక్కుపై కొరవడిన స్పష్టత

... 5వ పేజీ తరువాయి

సంస్థల బకాయిలు చెల్లించడానికి వినియోగిస్తున్నారు. ఉద్యోగులకు బకాయిపడిన జీతాల కోసం ఆ నిధులు ఉపయోగించడం లేదు. కార్మిక సంఘాలు ప్రశ్నిస్తే సీఎండీ సహా ఫైనాన్స్ విభాగంలో ఎవరూ నోరు విప్పడం లేదు. పైగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం, కాంట్రాక్టు కార్మికులను తొలగించడం ద్వారా అశాంతి వాతావరణం కొనసాగేలా చేస్తున్నారు. ఒకవైపు ఆర్థిక సాయం చేస్తూనే, మరోవైపు స్టీల్‌ప్లాంటును 100 శాతం విక్రయించే ప్రతిపాదన వెనక్కి తీసుకోలేదని ప్రకటనలు గుప్పిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు సీఎం రమేశ్, బాలశౌరి, మల్లు రవి వేర్వేరుగా ఇటీవల లోక్‌సభలో ప్రశ్నలు సంధించారు. స్టీల్‌ప్లాంటుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీని వినియోగించడానికి కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలు ఏమిటి?, ఉద్యోగులు, కార్మికులకు నెలలకొద్దీ జీతాలు ఇవ్వని విషయం వాస్తవమేనా?, అందించిన ప్యాకేజీ నుంచి జీతాలు చెల్లించే అవకాశం ఉందా?, వారికి ఉద్యోగ భద్రతపై తీసుకున్న చర్యలు ఏమిటి ? అంటూ ప్రశ్నలు సంధించారు.

ఇదీ సమాధానం

ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ఉక్కు మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానాలు సూటిగా లేకపోవడం గమనార్హం. విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించామని, అందులో 10,300 కోట్లు ఈక్విటీగా మార్చామని, మరో రూ.1,140 కోట్లు వర్కింగ్ కేపిటల్ అని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ఉక్కు అమ్మకాల ద్వారా రూ.12,615 కోట్ల ఆదాయం వచ్చిందని, అప్పటికి రూ.3,943.43 కోట్ల నష్టం వచ్చిందని పేర్కొన్నారు. మొత్తం అప్పులు రూ.38,965 కోట్లకు చేరాయని వివరించారు. ఉద్యోగులకు సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలలకు కొంత కొంత జీతాలు చెల్లించామని, ఇంకా బకాయి ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు.

ప్యాకేజీలో జీతాలు లేనట్టే..

అందించిన ప్యాకేజీ నుంచి ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని చెప్పారా? లేదా? అన్న ప్రశ్నకు మంత్రిత్వ శాఖ సమాధానం ఇవ్వలేదు. అలాగే వారి ఉద్యోగ భద్రతకు తీసుకున్న చర్యలు ఏమిటి?...అనే దానిపైనా జవాబు లేదు. కానీ ఉద్యోగుల పనితీరు, పూర్తిస్థాయి ఉత్పత్తి వంటి లక్ష్యాలు ఇచ్చి, ప్లాంటు నష్టాల నుంచి బయటపడే చర్యలు తీసుకున్నామని, ఈ ఆర్థిక సాయం కొనసాగుతుందని తెలిపింది.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

సింహాచలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవం విజయవంతానికి అధికారులు తప్పనిసరిగా ఎస్ఓపీ (స్టాండర్డు ఆపరేటింగ్ ప్రొసీజర్)ని పాటించాలని దేవదాయ శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ ఆదేశించారు. ఈమేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ (ఎఫ్ఏసీ) కె. రామచంద్ర మోహన్ ఈనెల 17న ఆ శాఖ కార్యదర్శికి ఉత్సవ నిర్వాహణకు అనుసరించాల్సిన విధి విధానాలను తెలియజేశారు. ఎస్ఓపీ వల్ల భక్తులందరికీ స్వామివారి నిజరూప దర్శనం లభించడంతో పాటు కనీస సౌకర్యాల కల్పనకు అవకాశం కలగనుంది.

'విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం'

తగరపువలస, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలో ఉన్న అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. తగరపువలస, మాకవరపాలెం, భోగాపురం, గరివిడి బ్రాంచ్‌లకు చెందిన 1520 మంది గ్రాడ్యుయేటర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారితో పాటు 1137 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జేఎన్‌టీయూ (విజయనగరం) వీసీ జి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దివీస్ జనరల్ మేనేజరు ఎం.ఎస్.ఎన్.రావు కృత్రిమ మేథో ఫార్మసీ. వైద్య రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబోసిస్ టెక్నాలజీ సీఈఓ ఓరుగంటి సురేష్‌కుమార్, అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డా. ఎం. ప్రియాంక, వైస్ ఛైర్మన్ శివనందీస్, ఎండీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగనబందలో గోమాత, భూమాత పూజలు

భీమునిపట్నం (రూరల్), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగనబంద గ్రామంలో విశాఖ గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో శనివారం భూసుపోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈనెల 30 నుంచి వచ్చేనెల 30వ తేదీ వరకు ప్రకృతి శ్రేయస్సు పరిరక్షణలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రసాయన రహిత పంటలే తమ సంస్థ లక్ష్యమన్నారు. అనంతరం సమితి రాష్ట్ర నాయకుడు తిరుపతయ్య, విశాఖ జిల్లా అధ్యక్షుడు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, తమ్మిన నరసింగరావు ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు వివరించి, గోమాత, భూమాత పూజలు జరిపారు.

నూకాలమ్మ ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

భీమునిపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జరిగే నూకాలమ్మ ఉత్సవాలను ప్రజలు విజయవం తం చేయాలని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ కోరారు. శనివారం ఆయన టీడీపీ కార్యాలయంలో ఉత్సవాల నిర్వహణపై అధికారులు, కమిటీ సభ్యులు, నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా జీవీఎంసీ అధికారులు కుళాయిల ద్వారా తాగునీటిని రెండు పూటలా అందించాలని, అన్ని ప్రాంతాల్లో వీధి లైట్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను కోరారు. ఉత్సవాలు జరిగే నాలుగు రోజులు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీసులను కోరారు. అమ్మవారి దర్శనాల క్యూలైన్ల ఏర్పాట్లు గురించి ఆలయ ఈఓ మురళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కమిటీ సభ్యులతో కలిసి నూకాలమ్మ ఆలయాన్ని సందర్శించి, అమ్మవారి దర్శనం చేసుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు, భీమిలి సీఐ తిరుమలరావు కూడా ఆలయాన్ని సందర్శించి దర్శనాలకు క్యూలైన్ల ఏర్పాటు పై ఈవో మురళి, పూజారి చౌదరి వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రసన్నవాణి, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లిపిల్లి వేణుబాబు, యెచ్చర్ల హరి, నాయకులు గాడు అప్పలనాయుడు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, ఉత్సవ కమిటీ కోశాధికారి పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాసి వినోద్‌కుమార్, కోఆర్డినేటర్ గొరపల్లి సన్యాసిరావు, కామేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు మజ్జిగ, పాలు పంపిణీ

సింహాచలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి తాపం నుంచి భక్తులకు ఉపశమనం కలిగేలా సింహాచలం దేవస్థానం ఈఓ కె. సుబ్బారావు చర్యలు చేపట్టారు. స్వామివారి దర్శనం తరువాత భక్తులు బయటకు వచ్చే దక్షిణ రాజగోపురం మార్గంలో మజ్జిగ పంపిణీని శనివారం ఆయన ప్రారంభించారు. అలాగే ఉచిత, శ్రీఘ్ర, అతిశ్రీఘ్ర దర్శనం క్యూలో వెళ్లే చిన్నారులకు ఎస్‌బీటీ కౌంటర్ ప్రవేశ మార్గం వద్ద పాలు పంపిణీ చేశారు. మధురవాడ ప్రాంతానికి చెందిన శ్రీభక్తి సకల దేవతా చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో పిల్లలకు పాలు అందించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులకు సేవలందించేందుకు ముందుకు వచ్చేవారిని ప్రోత్సహిస్తామన్నారు. తొలిరోజు సుమారు వెయ్యి లీటర్ల మజ్జిగ పంపిణీ చేశామని, వేసవి అన్ని రోజులు మజ్జిగ, పాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓలు ఎన్. ఆనందకుమార్, పిళ్లా శ్రీనివాసరావు, ఈఈ డీజీ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి పాలు అందిస్తున్న ఈఓ సుబ్బారావు

బెట్టింగ్ భూతం

... 5వ పేజీ తరువాయి

పేమెంట్ యాప్స్ ఉంటే వాటిని తీసేయాలి. అలాగే, ఉద్యోగుల విషయంలో కూడా కుటుంబ సభ్యులు జాగ్రత్తగా ఉండాలి.మ్యాచ్ చూస్తూ ఫోన్లు మాట్లాడుతున్నా, అదే పనిగా ఫోన్ పట్టుకుని మ్యాచ్‌లు వీక్షిస్తున్నా, తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నా,మ్యాచ్ చూస్తూ అతిగా స్పందిస్తున్నా...ఒక్కోరోజు అధిక మొత్తంలో డబ్బులు తెచ్చి ఇస్తున్నా, కొన్నిసార్లు అవసరానికి మించి డబ్బు అడుగుతున్నా అప్రమత్తం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవన్నీ బెట్టింగ్ కాసేందుకు అవకాశం ఉండే అంశాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.

బయటకు తీసుకురావడం ఒకింత క్లిష్టమైన ప్రక్రియ

- డాక్టర్ ఎన్ఎన్ నిహాల్, మానసిక నిపుణులు



బెట్టింగ్ వ్యసనం బారినపడిన వారిని బయటకు తీసుకురావడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఈ వ్యసనానికి గురైనవాళ్లు తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోతుంటారు. ఆర్థికంగా తీవ్ర అగాధంలోకి వెళ్లిపోతారు. మొదట్లో తక్కువ మొత్తంతోనే ప్రారంభిస్తారు. తరువాత అది ఏ స్థాయికి వెళుతుందో చెప్పలేము.డబ్బులు దొరికిన చోటల్లా అప్పులు వాడేస్తుంటారు. అది ఎంత అన్న విషయం కూడా వారికి పట్టదు. బయటకు వచ్చేసరికి రూ.లక్షలు దాటుతుంది. ఇటువంటి వారిని వేగంగా గుర్తించి కౌన్సెలింగ్, కొన్నిరకాల మందులు ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది.

అపర్ణకు నారీశక్తి పురస్కారం

మధురవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పిలకవానిపాలెంకు చెందిన కూచిపూడి నృత్యకారిణి ఎస్ఎస్‌బీ అపర్ణ నారీశక్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమేరకు ఆమెకు నిర్వాహకుల నుంచి శనివారం ఆహ్వానం అందింది. అపర్ణ ఇప్పటికే పలు రాష్ట్రాల్లో 500కు పైగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చి, పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. ఇటీవల చెన్నైలో సౌత్ ఇండియా ఉమెన్ ఎచీవర్ అవార్డు పొందారు. ఈమేరకు న్యూఢిల్లీకి చెందిన దూస్‌రా దశక్ ఫౌండేషన్ నారీ శక్తి అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును దేశంలో పలు రంగాల్లో అగ్రగామిగా ఉన్న మహిళలకు అందిస్తారు. వచ్చేనెల 20న ప్రముఖ సినీ నటి మయూరి సుధాచంద్రన్ చేతుల మీదుగా న్యూఢిల్లీలో అవార్డు అందుకోనున్నట్టు అపర్ణ తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ

పద్మనాభం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో పోషన్ బీ - పఢాయి బీ (పోషణ, విద్య) కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. చివరి రోజు శిక్షణలో కిశోర బాలికలు, వారి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై నిర్వాహకులు అవగాహన కల్పించారు. రెండు రోజులుగా కార్యకర్తలు తాము నేర్చుకున్న అంశాలపై చార్టుల ద్వారా ప్రదర్శించారు. భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉమాజానకి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



శిక్షణ అనంతరం బ్యానర్ ప్రదర్శిస్తున్న కార్యకర్తలు

నాలుగేళ్ల కిందటి హత్య కేసును ఛేదించిన పోలీసులు

రౌడీ షీటర్ శ్రీను మర్డర్ కేసులో ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల కిందట జరిగిన రౌడీషీటర్ హత్య కేసును నగర పోలీసులు ఛేదించారు. కేసు దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్ డిటెక్టబుల్ (యూఎన్) కేసుగా పేర్కొంటూ 2022 ఆగస్టులో కేసు మూసేశారు. సీపీ శంఖబ్రతబాగ్చి యూఎన్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, నాలుగేళ్ల కిందట జరిగిన రౌడీషీటర్ హత్య కేసు దర్యాప్తు బాధ్యతలను కంట్రోల్‌రూమ్ సీఐ షేక్ హుస్సేన్‌కు అప్పగించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన సీఐ హుస్సేన్ దర్యాప్తు ప్రారంభించి హత్యకు పాల్పడిన నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. పోలీస్ కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం సీపీ శంఖబ్రత బాగ్చి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

జ్ఞానాపురానికి చెందిన గనగళ్ల శ్రీను అలియాస్ మెంటల్ శ్రీను అలియాస్ ఇంద్రజిత్ (45) పోర్టు ఏరియాలో తుక్కు చోరీలు చేస్తూ జీవిస్తుండేవాడు. శ్రీనుపై హార్బర్ పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్‌షీట్‌తోపాటు టూటౌన్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. 2021 ఏప్రిల్ 22న కంచరపాలెం మెట్టు పైడిమాంబ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఒకరు హత్యకు గురైనట్టు 112 నంబర్‌కు స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతుడు గనగళ్ల శ్రీనుగా గుర్తించారు. దీనిపై కేసు నమోదుచేసిన కంచరపాలెం పోలీసులు దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో కేసును 2022లో మూసేశారు. ఇటీవల యూఎన్ కేసులను తిరిగి తెరిచి దర్యాప్తు చేయాలని సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశించారు. అందులో భాగంగా గనగళ్ల శ్రీను హత్యకేసు దర్యాప్తును కంట్రోల్‌రూమ్ సీఐ షేక్‌హుస్సేన్‌కు అప్పగించారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన హుస్సేన్ హత్యకు గురైన శ్రీనుకు ఎవరెవరితో పరిచయాలు ఉన్నాయి, ఎవరెవరితో విభేదాలు ఉన్నాయనే దానిపై కొబ్బరితోట, భూపేష్‌నగర్, అల్లిపురం, రైల్వేక్వార్టర్స్, జ్ఞానాపురం, కంచరపాలెం వంటి ప్రాంతాల్లో 28 మంది తుక్కు వ్యాపారులు, తుక్కు దొంగలతో పాటు 35 మంది హిజ్రాలను కలిసి ఆరా తీశారు. ఈ క్రమంలో తుక్కు చోరీలు చేసి జీవనం సాగించే అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జంగవానిపాలేనికి చెందిన లాలం గణేష్‌కు, శ్రీనుకు విభేదాలు ఉన్నట్టు తేలింది. శ్రీను సోదరుడైన తోటయ్య ఒక సెల్‌ఫోన్‌ను చోరీ చేసి లాలం గణేష్ సోదరుడైన లాలం శ్రీనుకు విక్రయించగా, పోలీసులు టెక్నాలజీ ఆధారంగా చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. తోటయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తోటయ్యకు బెయిల్ కోసం రూ.పదివేలు ఖర్చు అవ్వడంతో లాలం శ్రీను, గణేష్ వల్లే తన సోదరుడు పోలీసులకు దొరికిపోయాడని, రూ.పదివేలు బెయిల్ కోసం ఖర్చయిందని గనగళ్ల శ్రీను రగిలిపోతుండేవాడు. బెయిల్ కోసం ఖర్చయిన డబ్బుల కోసం లాలం గణేష్‌తో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో 2021 ఏప్రిల్ 16న లాలం గణేష్, గనగళ్ల శ్రీను కొట్టుకున్నారు. గణేష్‌కు ఆ సమయంలో అతనితోపాటు ఉన్న పెదగంట్యాడకు చెందిన తుక్కు దొంగ కొమర తారకేశ్వరరావు సహకరించాడు. ఇద్దరూ కలిసి శ్రీనుని హత్య చేసి, మర్మాంగాన్ని కత్తిరించి రైల్వే ట్రాక్ పక్కనపడేసి వెళ్లిపోయారు. పోలీసులు సేకరించిన సమాచారం ఆధారంగా గణేష్, తారకేశ్వరరావును విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ హుస్సేన్‌తోపాటు ఇతర సిబ్బందికి సీపీ రివార్డులు అందజేశారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

సాగర్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శనివారం ఆయన గీతం వర్సిటీలో క్రెడాయ్ ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ కార్నివాల్ 2025ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ విశాఖపట్నం ఛైర్మన్ కేఎస్ఆర్‌కే రాజు (సాయి), ప్రెసిడెంట్ వి. ధర్మేందర్, సెక్రటరీ వి. శ్రీను, తదితరులు పాల్గొనగా, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్ తదితర క్రీడలు నిర్వహించారు.

రోడ్డు పనులకు భూమి పూజ

మధురవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు ఎన్‌జీఓ కాలనీలో రహదారి పనులకు వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌జీఓ కాలనీ నుంచి భగత్‌నగర్ వరకు రహదారి నిర్మాణానికి రూ. 45 లక్షలు మంజూరైనట్టు తెలిపారు.

జిమ్‌సర్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సాగర్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్), గీతం దంత వైద్య కళాశాలల నుంచి వైద్య విద్య పూర్తి చేసుకున్న 305 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 132 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ డిగ్రీలు, 122 మంది బీడీఎస్, 51 మందికి ఎండీ డిగ్రీలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీ ఎంఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ బలరామ్‌భార్గవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యానికి ప్రాచుర్యం కల్పించడం ద్వారా అవకాశాలను పెంచుకోవాలన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ వైద్య రంగంలో నూతన పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే వైద్యుల పరిధి విస్తరిస్తుందని, లేకపోతే పెరుగుతున్న పోటీ ప్రపంచంలో కనమరుగైపోవడం ఖాయమన్నారు. గీతం వీసీ ప్రొఫెసర్ యరోల్ డిసోజా మాట్లాడుతూ గీతం ప్రగతిని వివరిస్తూ వైద్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను తెలియజేశారు. అనంతరం అతిథులు విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పీ రావు, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.గంగాధరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, గీతం దంత వైద్య కళాశాల ఆస్పత్రి ప్రిన్సిపాల్ వి.వి.నరసింహరావు, గీతం పాలకమండలి సభ్యులు, గీతం సలహాదారు ప్రొఫెసర్ జి. సూర్యనారాయణ , తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న వాహనాలు సీజ్

పద్మనాభం,మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుద్రపల్లి వద్ద వెంగమాంబ క్వారీ నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న లారీ, జేసీబీని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈనెల 21న రాత్రి గస్తీ తిరుగుతున్న సమయంలో పోలీసులు ఈ వాహనాలను పట్టుకోవడంతో సీఐ శ్రీధర్ కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు అప్పగించారు. తహసీల్దార్ ఆయా వాహనదారులకు రూ. 15 వేల జరిమానా విధించారు.

బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై హర్షం

సాగర్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పునరుద్ధరణపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పునరుద్ధరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం విశేషంగా కృషి చేశాయన్నారు.

ప్రభుత్వ భూమిలో షెడ్లు తొలగింపు

పద్మనాభం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రేవిడిలో సర్వే నెంబరు 8లో ప్రభుత్వ భూమిలో ఉన్న షెడ్లను తహసీల్దారు ఆనందరావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. కాలువపై అక్రమంగా షెడ్లు వేయడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు వాటిని తొలగించారు.

పేదరిక నిర్మూలనకు పి-4 విధానం దోహదం

మహారాణిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పి-4 విధానం పేదరిక నిర్మూలనకు దోహదపడుతుందని, అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపి లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రైతు,స్వయంసహాయక, వ్యాపార సంఘాల ప్రతినిధులు, అధికారు లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పి-4 సర్వే ఆవశ్యతను తెలుసు కొని భాగస్వాములు కావాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, చిరు వ్యాపారులకు తగినంత సాయం అందుతుందని, ఆయా వర్గాల సలహా, సూచనలతో మరింత సహా యం అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు శ్రీనివాసరావు, పీడీలక్ష్మీపతి, మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు, ఉషారాణి పాల్గొన్నారు.

28వ వార్డులో గ్రామసభ..

రామ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న పి-4 పథకం ద్వారా అందిన సమాచారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు టీడీపీ 28వ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు తెలిపారు. శనివారం బానోజీ నగర్‌లో పి-4 సర్వేపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ గ్రామసభ నిర్వహించారు.

సినిమా గైడ్

- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 13, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది)50, బరబాటి 24, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని, యువత అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నగర పోలీసుల ఆధ్వర్యంలో నవ సమాజ నిర్మాణం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల జీవితాలు ఎలా పాడవుతాయి, యువత వీటికి దూరంగా ఉండడంవల్ల కలిగే మేలు వంటి అంశాలను ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీ మాట్లాడుతూ డ్రగ్స్ యువత జీవితాలను ఛిద్రం చేస్తాయన్నారు. డ్రగ్స్ వల్ల శరీరం, మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అందువల్ల విద్యార్థులందరూ ఇటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యావంతులు కూడా గత కొన్నాళ్లుగా సైబర్ నేరాలకు పాల్పడుతుండడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. పరిసరాల ప్రభావం కూడా విద్యార్థులు, యువతపై అధికంగా ఉంటుంది కాబట్టి డ్రగ్స్ వంటి వాటికి దూరంగా తమ పిల్లలు ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ జిందాల్, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, ప్రొఫెసర్ హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల తొలగింపును అడ్డుకోవాలి

కూటమి పార్టీల నేతలకు సీఐటీయూ డిమాండ్

మద్దిలపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) :స్టీల్‌ప్లాంటులో పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు చర్యలను కూటమి ప్రభుత్వం అడ్డుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. ఉక్కు ఉద్యోగుల తొలిగింపును నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలో శనివారం ఆందోళన చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుమార్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పార్లమెంటులో చెప్పడాన్ని వ్యతిరేకిస్తూ కరపత్రాల పంపిణీ చేపట్టామన్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ రైతుబజార్లు, బస్టాండ్‌లలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి కేంద్రం ప్రభుత్వం వైఖరిపై అవగాహన కల్పిస్తామన్నారు. స్టీల్‌ప్లాంటుకు రూ.11,440 కోట్లు మేమే తెచ్చామని టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారన్నారు. ప్లాంట్‌కు వచ్చిన ప్యాకేజీతో కార్మికులు కష్టపడి పనిచేసి లాభాలు తెచ్చుకోవాలని, ఇదే చివరి ప్యాకేజీ అని మళ్లీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్యాకేజీలో రూపాయి కూడా కార్మికుల ప్రయోజనాలు, ఉత్పత్తి కోసం వినియోగించకూడదని నిబంధన విధిస్తే ఉక్కు పరిశ్రమకు లాభాలు ఎక్కడొస్తాయని ప్రశ్నించారు. 4500 మంది కాంట్రాక్ట్ కార్మికులు, 2500 మంది పర్మినెంట్ కార్మికులను తొలిగించేందుకు కేంద్రం ప్రభుత్వం పూనుకుందన్నారు. ఇది దుర్మార్గమన్నారు. తక్షణమే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్ విలీనం చేసి సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, వి.కృష్ణారావు, ఎ.సింహాచలం, ఎ.అప్పారావు, రమేష్, పోలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



పైపులైన్ లీకేజీతో వృథాగా అవుతున్న తాగునీరు

ఆరిలోవ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ కొత్తగా జీవీఎంసీ వారు వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేశారనుకుంటున్నారు? అయితే తప్పులో కాలేసినట్టే.. ఇది పైపులైన్ లీక్ కావడంతో ఎగజిమ్ముతూ వృథాగా పోతున్న తాగునీరు. హనుమంతవాక జంక్షన్ నుంచి విశాలాక్షినగర్ వైపు వెళ్లే రోడ్డులో పైపులైన్ లీక్ అయింది. దీంతో వందలాది లీటర్ల తాగునీరు వృథాగా పోయింది. స్థానికులు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ వాటర్ వర్క్స్ సిబ్బంది మరమ్మతు చేయడం మొదలుపెట్టారు. అప్పటికే గ్యాలన్ల కొద్దీ తాగునీరు వృథాగా పోయింది. పైప్ లైన్‌కు ఉన్న వాషర్ పాడైపోవడంతో వాటర్ లీకైనట్టు వాటర్ వర్క్స్ సిబ్బంది తెలిపారు. ఎండా కాలంలో ముందస్తు, జాగ్రత్తలు తీసుకోవడం లేదంటే ఫిర్యాదు అందిన వెంటనే మరమ్మతులు చేపడితే ఇలా తాగునీరు వృథా కాదని పలువురు అంటున్నారు. అసలే ఎండాకాలం కావడంతో పలు చోట్ల నీటి ఎద్దడి సమస్య ఉంది.అలాంటపుడు ఇలాంటి నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

వీఎంఆర్డీఏలో ఎర్త్ అవర్



వీఎంఆర్డీఏలో లైట్లు ఆపేసిన దృశ్యం

సిరిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ నిర్వహించే ఎర్త్ అవర్‌లో భాగంగా శనివారం వీఎంఆర్డీఏ నిర్వహిస్తున్న వీఎంఆర్డీఏ పార్కు, సెంట్రల్ పార్కు, కైలాసగిరి, సబ్‌మైరెన్ మ్యూజియం, టీయూ-142, సీ హ్యారియర్ మ్యూజియం, ఉద్యోగభవన్ కాంప్లెక్స్‌లు వంటి ముఖ్యమైన ప్రదేశాల వద్ద విద్యుత్ దీపాలను ఆపివేసి సంఘీభావం ప్రకటించనట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. ఈ కారణంగా విద్యుత్ వినియోగం తగ్గి భూతాపం తగ్గుతుందన్నారు. తద్వారా మనమంతా వాతావరణ పరిరక్షణలో భాగస్వాములమవుతామని తెలిపారు.

మురుగుతో సముద్ర జలాలు కలుషితం

- నియంత్రణలో జీవీఎంసీ విఫలం
- మత్స్య సంపదకు అపార నష్టం
- కేవలం రూ.10 కోట్లు వెచ్చిస్తే సమస్య పరిష్కారం
- పర్యావరణవేత్త, జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ



సముద్ర జలాలను పరిశీలిస్తున్న బొలిశెట్టి సత్యనారాయణ

పెదవాల్తేరు. మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నగరం నుంచి వచ్చే మురికి నీరు సముద్రంలో కలిసి పోవడంతో సముద్ర జాలాలు పూర్తిగా కాలుష్యం అవుతున్నాయని పర్యావరణవేత్త, జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం లాసెన్స్ బే కాలనీ సమీపంలో గల సముద్ర తీరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్ని అరికట్టడంలో జీవీఎంపీ విఫలం అవుతోందని విమర్శించారు. దీనివల్ల సముద్ర జలాలు కలుషితమై, అందులోని మత్స్య సంపదకు నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య కేవలం ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంగానే ఎదురవుతోందని మండిపడ్డారు. గతంలో ఈ కాలుష్య సమస్యపై తాను వాటర్‌మాన్ ఆఫ్ ఇండియాతో కలసి ఒక కేసు కూడా వేసినట్టు గుర్తు చేశారు. కేవలం రూ.పది కోట్లు జీవీఎంసీ వెచ్చిస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కాలుష్యం వల్ల సుమారు 20 వేల మత్స్యకార కుటుంబాలు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. గతంలో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించి, ఈ సమస్య పరిష్కరించవచ్చని పేర్కొన్నారని బొలిశెట్టి పేర్కొన్నారు. కానీ దీనిపై ప్రభుత్వం గాని, జీవీఎంసీ గాని ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బొలిశెట్టి డిమాండ్ చేశారు.

సాగర తీరంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

సిరిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సాగర్ తీరాన ఆధ్యాత్మిక శోభ వెల్లి విరిసింది. గురజాడ కళాక్షేత్రంలో శ్రీవెంకన్నమాచార్య సేవ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం కన్నులపండువగా శ్రీసీతారామచార్యులు ప్రవచనంతో గోవింద నామస్మరణతో మారుమోగింది. భక్తిమార్గంలో రథసారథులుగా అన్నమయ్య సేవలో నిస్వార్థంగా తమ సమయాన్ని అంకితం చేస్తూ సంస్కృతీ సంప్రదాయాలకు వారధులుగా నిలుస్తున్న మహిళామణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ చిరు సత్కారాలు చేయాలనే ఉద్దేశంతో శ్రీవెంకటన్నమాచార్య సేవ ట్రస్టు సంకల్పించింది. ఇందులో భాగంగా నగరంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న శ్రీకనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం ఈవో శోభారాణి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ సంధ్యాదేవి, వుమెన్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ జయదేవీ, బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్ ఉషశ్రీ పెద్దిశెట్టి, సరిపల్లి భాస్కరమ్మలకు అన్నమయ్య విశిష్ట సేవ పురస్కారాలతో సత్కరించారు. ట్రస్ట్ చీఫ్ డైరెక్టర్ సునీత కొఠారిని విశిష్ట సేవా రత్న బిరుదుతో అన్నమయ్య 12వ తరం వంశీకులు శ్రీతాళ్లపాక స్వామి దంపతులు పురస్కారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి మాట్లాడుతూ మంచి కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో అన్నమయ్య సేవా టీమ్ సభ్యులు ఎం.లక్ష్మీ, విజయ, నాగలక్ష్మి, సుమ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణోత్సవం



ట్రస్ట్ చీఫ్ డైరెక్టర్ సునీతను విశిష్ట సేవారత్నతో సత్కరిస్తున్న అతిథులు

ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కూర్మన్నపాలెం,మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అఖిలపక్ష కార్మిక సంఘాల పర్యవేక్షణలో ఉద్యోగులు, కార్మికులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ దీక్షలు చేపట్టి 1,500 రోజులైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. స్టీల్ ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవడంతో పాటు ఇకపై విధుల నుంచి తొలగించరాదని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులకు పూర్తిస్థాయిలో జీతాలు ఇవ్వడంతో పాటు బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. నేతలు జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్లాంటును పరిరక్షించడంతో పాటు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు. ప్లాంటుకు మూడేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలన్నారు. ఇప్పటికైనా ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని పీఎంమోదీ ప్రకటించాలని పేర్కొన్నారు కార్యక్రమంలో నాయకులు ఎన్.రామారావు, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, జె.రామకృష్ణ, డి.అప్పారావు, ఎన్.సింహాద్రి, పెంటారావు, సత్యారావు, డీసీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా కాలభైరవుడి ఆలయ వార్షికోత్సవం

వెంకోజీపాలెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం శివాలయం సముదాయంలో ఉన్న కాలభైరవస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాలభాస్కర శర్మలు తెల్లవారు జాము నుంచి స్వామివారికి పూజలు జరిపారు. అర్చకులు కాలభైరవ స్వామి ప్రాముఖ్యతను తెలియజేస్తూ, భక్తులందరికీ ఆశీస్సులు కోరుతూ స్వామివారికి అభిషేకం, అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో కాలభైరవుడిని దర్శించుకున్నారు.

గంజాయి రవాణాపై కఠిన చర్యలు

- 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా గంజాయి నిర్మూలన
- ప్రధాన సూత్రధారుల ఆస్తుల జప్తు
- వీడియో కాన్ఫరెన్స్‌లో డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

మద్దిలపాలెం, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశించారు. విశాఖ రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, పోలీస్ ఉన్నతాధికారులతోశనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన సంకల్పం కార్యక్రమంలో భాగంగా గంజాయి రవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

గంజాయి అక్రమ రవాణాలో ప్రధాన సూత్రదారులను గుర్తించి వారి ఆస్తులను త్వరతగతిన జప్తు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ కేసుల్లో ఉన్న నిందుతులను తక్షణమే గుర్తించి డిటెయిన్ చేయాలని సూచించారు. గంజాయి వినియోగదారులను గుర్తించి కౌన్సెలింగ్ చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రజల సహకారంతో సమగ్ర సమాచారం సేకరించాలని సూచించారు. ఇప్పటి వరకూ 296 మంది బాధితులను డీ-అడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే 24 కొత్త చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేసి వారిపై ఎన్బీడబ్ల్యూలను ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులను వేగవంతం చేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలన్నారు. గంజాయి పట్టుకున్న కేసుల్లో నార్కోటిక్స్ బ్యూరోకు రివార్డు కోసం అప్లై చేయాలన్నారు. పోక్సో కేసుల్లో బాధితులకు కలెక్టర్ల ద్వారా నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యల్లో భాగంగా శక్తి యాప్, శక్తిబృందాలను వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేసి, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధునిక సాంకేతికను ఉపయోగించి నేరాలను త్వరతగతిన ఛేదించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీలు తుహిన్ సిన్హా, అమిత్ బర్దర్, వకుల్ జిందాల్, మహేశ్వరరెడ్డి, మాదవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌లో రహదారుల అలైన్‌మెంట్ మార్పుచేయాలి

- వీఎంఆర్డీఏ చైర్మన్‌కు నేరెళ్లవలస ప్రాంతీయుల వినతి



ప్రణవ్‌గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేరెళ్ల వలస ప్రాంతవాసులు

సిరిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ రూపొందించిన మాస్టర్ ప్లాన్ 2014కు సంబంధించి వైజాగ్ పోర్టు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నేరెళ్ళవలస నుంచి వెళ్లే 70 మీటర్ల రహదారి అలైన్‌మెంట్ మార్పు చేయాలని ఆయా ప్రాంత ప్రజలు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్య, ఎగువ మధ్య తరగతి వర్గాలకు చెందిన తామంతా ఎంతో కష్టపడి నేరెళ్లవలస వద్ద వీఎంఆర్డీఏ అభివృద్ధి చేసిన పలు లే అవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేశామని, అలానే అదే రహదారిలో అనేకమంది పలు లే అవుట్‌లో స్థలాలు కొనుగోలు చేశారన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో ఆయా రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా భోగాపురం విమానాశ్రయం వెళ్లేందుకు నేరెళ్లవలస వద్ద వారి స్థలాల మీదుగా 70 మీటర్ల రహదారి నిర్మాణం ప్రతిపాదన చేశారన్నారు. ఇదే కొనసాగితే తమ స్థలాలుపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల 70 మీటర్ల రహదారి ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన వీఎంఆర్డీఏ చైర్మన్ మాట్లాడుతూ త్వరలో మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు స్వీకరించి అందరికీ ఆమోదయోగ్య రీతిలో మాస్టర్‌ప్లాన్ సవరిస్తామని హామీ ఇచ్చారు.

కిలోన్నర గంజాయి, గ్రాము ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం

- ముగ్గురి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

కూర్మన్నపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలోని మంగళపాలెం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఒక కిలో 545 గ్రాముల గంజాయి, ఒక గ్రాము ఎండీఎంఏ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళపాలేనికి చెందిన పాత రౌడీ షీటర్ కె.వెంకట మహేశ్, వడ్లపూడిలోని సిద్ధార్థనగర్‌కు చెందిన పాత నేరస్థుడైన కుప్పాల్ల వర్ధన్, వడ్లపూడికి చెందిన ఆటోడ్రైవర్ వనపల్లి మహేశ్‌లు నంబర్ ప్లేటు లేని పల్సర్ బైకుపై వస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వీరి వద్ద నుంచి ఒక కిలో 545 గ్రాముల గంజాయి, ఒక గ్రాము ఎండీఎంఏ డ్రగ్, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరు అరకులో, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా గుంత కుముడు వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి బెంగళూరులోని బాయ్ అనే వ్యక్తికి ఎక్కువ రేటుకు విక్రయిస్తుంటారు. అంతేకాక బాయ్ వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను తక్కువ రేటుకు కొనుగోలు చేసి విశాఖ నగరంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల వద్ద నుంచి సరకుతో పాటు బైకు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

బుల్లయ్య కళాశాలలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ జి.మధుకుమార్, రచయిత్రి సాయిలక్ష్మి కుమారి తదితరులు

సీతమ్మధార, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్.సాయిలక్ష్మి కుమారి 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ఇన్ హెల్త్‌కేర్ అనే అంశంపై పుస్తకం రాశారు. ఈ పుస్తకాన్ని కళాశాల్లో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ పుస్తక ప్రచురణలో అధ్యాపకుల బృందం చేసిన కృషిని ఆయన అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని విద్యార్థులకు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దీపక్ చౌదరి, డాక్టర్ జి.బాబు, డాక్టర్ కె.వి.రమణారావు తదితరులు పాల్గొని రచయితను అభినందించారు.

50వ వార్డులో గ్రామసభ

మాధవధార, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మాధవధార పరిధి 5 సచివాలయాల్లో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఏపీ ప్రభుత్వం నిర్దేశించిన పేదరిక నిర్మూలన లక్ష్యంగా పి-4 సర్వేలో ఈ ప్రాంతాల్లో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాల జాబితాను సచివాలయాల వద్ద ప్రదర్శించారు. వార్డుల్లో సచివాలయాల వారీగా పేదల అభ్యున్నతికి ఆర్థికంగా చేయూత అందించే కార్యక్రమం దశలవారీగా చేపట్టనున్నారు. గ్రామసభలో బీజేపీ 50వ వార్డు అధ్యక్షుడు కూన వెంకటరావు, నాయకుడు రామకృష్ణ, విశాఖ టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి ఎస్.వరప్రసాద్, సీనియరు నాయకులు రామచంద్రరావు, పి.శ్రీనివాసరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కళాకారులకు అవార్డులు

డాబాగార్డెన్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సుబ్బలక్ష్మీ కల్యాణ మండపం వేదికగా జిల్లాలో ప్రతిభావంతులైన కళాకారులకు ఆదివారం కళాప్రవీణ పురస్కారాలతో సత్కరిస్తామని సంఘం అధ్యక్షుడు కె.జనార్దన్ తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గౌరవ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, ఇతర సభ్యులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్.నాగరాజు పట్నాయక్, యాదకుమార్, మనోహర్, ధనుంజయ్ పాల్గొన్నారు.

'రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన'

అల్లిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ శనివారం నుంచి అంబేడ్కర్ జయంతి వరకు జిల్లాలో సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి తెలిపారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన తరువాత మోదీ ప్రభుత్వం మతపరమైన అంశాలతో ముస్లింలు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ పాలనలో మతం ఉపయోగించి భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.విమల, జి.ఎస్.జె అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో డిజిటల్ మూల్యాంకనం

డాబాగార్డెన్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ-డిజిటల్ మూల్యాంకనాన్ని అన్ని బ్రాంచ్‌లలో ప్రవేశపెట్టినట్లు కళాశాలల సెక్రటరీ ఎన్.సుగుణరెడ్డి తెలిపారు. మిడ్ పరీక్ష జవాబు పత్రాలను కూడా ఒక బ్రాంచ్‌వి మరో బ్రాంచ్‌కు పంపి డిజిటల్ మూల్యాంకనం చేయించామన్నారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ విడుదల చేశారన్నారు.

16 మంది పోలీస్ సిబ్బందికి బదిలీ

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లు, విభాగాల్లో పనిచేస్తున్న 16 మంది సిబ్బందిని సీపీ శంఖబ్రత బాగ్చి శనివారం అంతర్గత బదిలీ చేశారు. ఒకేచోట ఎక్కువ కాలం పనిచేస్తున్నవారితోపాటు పనితీరు సరిగా లేనివారిని బదిలీ చేశారు. ఇందులో ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

కప్పరాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచరపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వవార్డు పరిధి కప్పరాడలో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. కప్పరాడ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రధాన గెడ్డకు రక్షణ గోడ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనికి రూ.29.67 లక్షలు విడుదలయ్యాయి. పనుల ప్రారంభ సూచికగా కార్పొరేటర్ కంటిపాము రాజేశ్వరి కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, గురువాజీ, గుణుపూడి అరుణ్‌బాబు, అరుణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు పి-4 విధానం దోహదం: కలెక్టర్

మహారాణిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పి-4 విధానం పేదరిక నిర్మూలనకు దోహదపడుతుందని, అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపి లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రైతు, స్వయంసహాయక, వ్యాపార సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పి -4 సర్వే ఆవశ్యతను తెలుసుకొని భాగస్వాములు కావాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, చిరు వ్యాపారులకు తగినంత సాయం అందుతుందని, ఆయావర్గాల సలహా, సూచనలతో మరింత సహాయం అందిస్తామని పేర్కొన్నారు. మత్స్యకారులకు వలల సేకరణకు హార్బర్ ప్రాంతంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు శ్రీనివాసరావు, పీడీ లక్ష్మీపతి, మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

బెట్టింగ్ భూతం

... 5వ పేజీ తరువాయి

పేమెంట్ యాప్స్ ఉంటే వాటిని తీసేయాలి. అలాగే, ఉద్యోగుల విషయంలో కూడా కుటుంబ సభ్యులు జాగ్రత్తగా ఉండాలి. మ్యాచ్ చూస్తూ ఫోన్లు మాట్లాడుతున్నా, అదే పనిగా ఫోన్ పట్టుకుని మ్యాచ్‌లు వీక్షిస్తున్నా, తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నా, మ్యాచ్ చూస్తూ అతిగా స్పందిస్తున్నా...ఒక్కోరోజు అధిక మొత్తంలో డబ్బులు తెచ్చి ఇస్తున్నా, కొన్నిసార్లు అవసరానికి మించి డబ్బు అడుగుతున్నా అప్రమత్తం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవన్నీ బెట్టింగ్ కాసేందుకు అవకాశం ఉండే అంశాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.

బయటకు తీసుకురావడం ఒకింత క్లిష్టమైన ప్రక్రియ



బెట్టింగ్ వ్యసనం బారినపడిన వారిని బయటకు తీసుకురావడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఈ వ్యసనానికి గురైనవాళ్లు తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోతుంటారు. ఆర్థికంగా తీవ్ర అగాధంలోకి వెళ్లిపోతారు. మొదట్లో తక్కువ మొత్తంతోనే ప్రారంభిస్తారు. ఆ తరువాత అది ఏ స్థాయికి వెళుతుందో చెప్పలేము. డబ్బులు దొరికిన చోటల్లా అప్పులు వాడేస్తుంటారు. అది ఎంత అన్న విషయం కూడా వారికి పట్టదు. బయటకు వచ్చేసరికి రూ.లక్షలు దాటుతుంది. ఇటువంటి వారిని వేగంగా గుర్తించి కౌన్సెలింగ్, కొన్నిరకాల మందులు ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది.

- డాక్టర్ ఎన్ఎన్ నిహాల్, మానసిక నిపుణులు

సీఎం చంద్రబాబు నిర్ణయం అభినందనీయం: శ్రీనివాసానంద సరస్వతి



శ్రీనివాసానంద సరస్వతి స్వామిని సత్కరించిన నిర్వాహకులు

సీతంపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ముంతాజ్ హోటల్ నిర్మాణ అనుమతులు రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద సరస్వతి కొనియాడారు. ఈ విజయం హిందూ బంధువులకు దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ఒక అడుగు ముందుకు వేసి వెంకటేశ్వర స్వామి కుల దైవమని చెప్పడమే కాకుండా నిరూపించుకున్నారన్నారు. తిరుమల దేవస్థానం వద్ద ముంతాజ్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి విజయం సాధించిన శ్రీనివాసానంద సరస్వతిని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ ఆధ్వర్యంలో గురుద్వార వద్ద ఓ హోటల్‌లో శనివారం సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణారావు, పలువురు ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. అట్లూరి నారాయణ రావు అధ్యక్షతన జరిగిన సత్కార కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ప్రొఫెసర్ కందర్ప విశ్వనాథమ్, వెంకటేశ్వరరావు, బాబ్జి, గాయత్రి మాతాజీ, సాధువులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణల్లో విద్యార్థుల భాగస్వామ్యం : ఎంపీ శ్రీభరత్



విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, బోయింగ్ ఫౌండేషన్ ప్రతినిధులతో ఎంపీ శ్రీభరత్

మురళీనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి లక్ష్యంగా సరికొత్త విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేస్తోందని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. అగ్రగామి పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను, సరికొత్త నైపుణ్య శిక్షణను అందించడంతో ఏపీ నూతన ఆవిష్కరణలు, కొత్తతరాన్ని సృష్టించే కేంద్రంగా అవతరిస్తుందన్నారు. శనివారం ఆయన విశాఖనగరం ఊర్వశి జంక్షన్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బోయింగ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏరో స్పేస్ రంగంలో పూర్తి చేసిన మూడో బ్యాచ్ గ్రాడ్యుయేట్లకు ధ్రువపత్రాలు అందించారు. ఏరోస్పేస్ తయారీ శిక్షణలో నాలుగో బ్యాచ్‌లో మరో 127 మందికి శిక్షణ కార్యక్రమం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ శిక్షణ, ప్లేస్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణారావు, ఫ్లూయెంట్ గ్రిడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.మురళీకృష్ణ, బోయింగ్ ఇండియా సౌత్ ఛీఫ్ ప్రవీణ యజ్ఞాంబట్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సీనియర్ ప్రెసిడెంట్ సుధా ప్రియదర్శన్, బోయింగ్ ఇండియా సౌత్ ఆసియా ప్రెసిడెంట్ సునీల్ గుప్తే తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్మాణాత్మక, పరిశ్రమల సంబంధిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బోయింగ్ ఎస్టిమేషన్ ప్రకారం రాబోయే 20 సంవత్సరాల్లో 37 వేల మంది పైలెట్లు, అంతే సంఖ్యలో సాంకేతిక నిపుణులు ఏరోస్పేస్ రంగంలో అవసరమవుతారని పేర్కొన్నారు. భారతీయ విమానయాన రంగం, ఏవియేషన్ హబ్స్‌లో విద్యార్థులు రాణిస్తారని శిక్షణ సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

ఆశీర్వాద్ యాత్ర ప్రారంభం



కొబ్బరికాయ కొడుతూ యాత్రను ప్రారంభిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, చిత్రంలో ఇతర ప్రముఖులు

మహారాణిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆదిమహాలక్ష్మి అష్టలక్ష్మి అమ్మ, జన్ ఆశీర్వాద యాత్రను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ప్రారంభించారు. అఖిల భారత అగర్వాల్ సమ్మేళన ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ జంక్షన్‌లో రాజస్థాన్ సాంస్కృతిక మండలి వద్ద నుంచి ప్రారంభించిన యాత్ర వాహనం వద్ద కమిషనర్ కొబ్బరి కాయ కొట్టారు. 18 రోజులు రాష్ట్రంలో యాత్ర సాగుతుందన్నారు. అనంతరం దక్షిణాది రాష్ట్రాల్లో మొత్తం 90 రోజులు యాత్ర కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంద్‌మాల్ అగర్వాల్, గోపాల్ శరణ గార్గ్, సుమన్, ప్రకాష్ చంద్‌గోయల్, ఎంపీ గోయల్, వినీత్ లోహియా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్‌గార్డుల అప్రమత్తతతో ఇటలీ వాసికి తప్పిన ప్రాణాపాయం



విశాఖ సమీపంలోని యారాడ సముద్రతీరంలో ఇటలీ పర్యాటకులను రక్షించిన మెరైన్ సిబ్బంది

సింధియా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యారాడ తీరంలో సముద్ర స్నానానికి దిగి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న ఇటలీ పర్యాటకుడిని జీవీఎంసీ సముద్ర తీర ప్రాంత లైఫ్‌గార్డులు రక్షించారు. ఇటలీకి చెందిన సుమారు 20 మంది పర్యాటకులు శనివారం యారాడ సముద్ర తీరాన్ని సందర్శించారు. అందులో కొందరు స్నానానికి దిగగా...ఒకరు కెరటాల తాకిడికి లోనికి కొట్టుకుపోయారు. తీర ప్రాంత మెరైన్ సిబ్బంది గుర్తించి గస్తీ కాస్తున్న లైఫ్‌గార్డులను అప్రమత్తం చేశారు. వారు సకాలంలో స్పందించి పర్యాటకులను కాపాడారు.

కంచరపాలెం వద్ద జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు



ఎన్ఎస్‌టీఎల్ సెక్యూరిటీ అధికారికి తాళం చెవి అందజేస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్



ఎన్ఎస్‌టీఎల్ గేట్ ఎదురుగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

మర్రిపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని ఎన్ఎస్‌టీఎల్ ప్రధాన గేటు ఎదురుగా శనివారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో రోడ్డు మధ్య బారికేడ్లు లేకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలతో రోడ్డు దాటుతుండటం, మరోపక్క వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో ప్రమాదాలు జరిగేందుకు అస్కారంగా మారింది. ఈ విషయమై పలు సార్లు ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురించింది. ప్రమాదకర పరిసితులను దృష్టిలో ఉంచుకొని బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. వీటిని ఎవరూ తొలగించకుండా గొలుసుతో తాళం వేశారు. ఒకవేళ అత్యవసర సమయంలో వాటిని తొలగించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా తాళం చెవిని అక్కడే ఉన్న ఎన్ఎస్‌టీఎల్ సెక్యూరిటీ అధికారి అవినాష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు, కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరధి, ఎస్సై శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల కిందటి హత్య కేసును ఛేదించిన పోలీసులు

రౌడీ షీటర్ హత్య కేసులో ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల కిందట జరిగిన రౌడీషీటర్ హత్య కేసును నగర పోలీసులు ఛేదించారు. కేసు దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్ డిటెక్టబుల్ (యూఎన్) కేసుగా పేర్కొంటూ 2022 ఆగస్టులో కేసు మూసేశారు. సీపీ శంఖబ్రతబాగ్చి యూఎన్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, నాలుగేళ్ల కిందట జరిగిన రౌడీషీటర్ హత్య కేసు దర్యాప్తు బాధ్యతలను కంట్రోల్‌రూమ్ సీఐ షేక్ హుస్సేన్‌కు అప్పగించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన సీఐ హుస్సేన్ దర్యాప్తు ప్రారంభించి హత్యకు పాల్పడిన నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. పోలీస్ కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం సీపీ శంఖబ్రతబాగ్చి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. జ్ఞానాపురానికి చెందిన గనగళ్ల శ్రీను అలియాస్ మెంటల్ శ్రీను అలియాస్ ఇంద్రజిత్ (45) పోర్టు ఏరియాలో తుక్కు చోరీలు చేస్తూ జీవిస్తుండేవాడు. శ్రీనుపై హార్బర్ పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్‌షీట్‌తో పాటు టూటౌన్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. 2021 ఏప్రిల్ 22న కంచరపాలెం మెట్టు పైడిమాంబ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఒకరు హత్యకు గురైనట్టు 112 నంబర్‌కు స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతుడు గనగళ్ల శ్రీనుగా గుర్తించారు. దీనిపై కేసు నమోదుచేసిన కంచరపాలెం పోలీసులు దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో కేసును 2022లో మూసేశారు. ఇటీవల యూఎన్ కేసులను తిరిగి తెరిచి దర్యాప్తు చేయాలని సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశించారు. అందులో భాగంగా గనగళ్ల శ్రీను హత్యకేసు దర్యాప్తును కంట్రోల్‌రూమ్ సీఐ షేక్‌హుస్సేన్‌కు అప్పగించారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన హుస్సేన్ హత్యకు గురైన శ్రీనుకు ఎవరెవరితో పరిచయాలు ఉన్నాయి, ఎవరెవరితో విభేదాలు ఉన్నాయనే దానిపై కొబ్బరితోట, భూపేష్‌నగర్, అల్లిపురం, రైల్వేక్వార్టర్స్, జ్ఞానాపురం, కంచరపాలెం వంటి ప్రాంతాల్లో 28 మంది తుక్కు వ్యాపారులు, తుక్కు దొంగలతో పాటు 35 మంది హిజ్రాలను కలిసి ఆరా తీశారు. ఈ క్రమంలో తుక్కు చోరీలు చేసి జీవనం సాగించే అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జంగవానిపాలేనికి చెందిన లాలం గణేష్‌కు, శ్రీనుకు విభేదాలు ఉన్నట్టు తేలింది. శ్రీను సోదరుడైన తోటయ్య ఒక సెల్‌ఫోన్‌ను చోరీ చేసి లాలం గణేష్ సోదరుడైన లాలం శ్రీనుకు విక్రయించగా, పోలీసులు టెక్నాలజీ ఆధారంగా చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. తోటయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తోటయ్యకు బెయిల్ కోసం రూ.పదివేలు ఖర్చు అవ్వడంతో లాలం శ్రీను, గణేష్ వల్లే తన సోదరుడు పోలీసులకు దొరికిపోయాడని, రూ.పది వేలు బెయిల్ కోసం ఖర్చయిందని గనగళ్ల శ్రీను రగిలిపోతుండేవాడు. బెయిల్ కోసం ఖర్చయిన డబ్బుల కోసం లాలం గణేష్‌తో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో 2021 ఏప్రిల్ 16న లాలం గణేష్, గనగళ్ల శ్రీను కొట్టుకున్నారు. గణేష్‌కు ఆ సమయంలో అతనితోపాటు ఉన్న పెదగంట్యాడకు చెందిన తుక్కు దొంగ కొమర తారకేశ్వరరావు సహకరించాడు. ఇద్దరూ కలిసి శ్రీనుని హత్య చేసి, మర్మాంగాన్ని కత్తిరించి రైల్వే ట్రాక్ పక్కనపడేసి వెళ్లిపోయారు. పోలీసులు సేకరించిన సమాచారం ఆధారంగా గణేష్, తారకేశ్వరరావును విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ హుస్సేన్‌తోపాటు ఇతర సిబ్బందికి సీపీ రివార్డులు అందజేశారు.

క్షయ నిర్మూలనకు కలిసికట్టుగా ముందుకెళదాం: కలెక్టర్

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు కలిసికట్టుగా ముందుకెళదామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ క్షయ దినం సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షయ బాధితులను కుటుంబ సభ్యులు వివక్షతో చూడరాదన్నారు. ఈ సందర్భంగా నాల్కో సంస్థ అందించిన ప్రత్యేక పోషకాహార కిట్లను బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి పూర్ణేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కిన గ్రేటర్ రాజకీయం

... 5వ పేజీ తరువాయి

ఎక్కువ మంది సభ్యుల బలం సరిపోయినా, తీర్మానం నెగ్గాలంటే మాత్రం కౌన్సిల్‌లో ఓటుహక్కు కలిగిన సభ్యుల్లో 2/3 వంతు మెజారిటీ తప్పనిసరి. కౌన్సిల్‌లో మొత్తం ఓటు హక్కు కలిగిన సభ్యులు 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు మొత్తం 111 మంది ఉండగా, వారిలో 2/3 వంతు అంటే 74 మంది సభ్యులు అవసరం అవుతారు. కూటమికి ఇప్పటికే సుమారు 81 మంది సభ్యుల బలం ఉండడంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు నోటీస్ అందజేశారు. నోటీసుపై ఉన్న సంతకాలు సభ్యులవేనా?, కాదా? అని నిర్ధారించుకున్న తర్వాత, అవిశ్వాస తీర్మానంపై చర్చకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు తేదీని నిర్ణయించి సభ్యులకు నోటీసులు జారీచేస్తారు. ఇప్పటికి ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని, పదవి నుంచి గొలగాని హరివెంకటకుమారి వైదొలగడం లాంఛనమేనని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలావుండగా మేయర్ పదవికి కూటమి నుంచి ఎవరు పోటీలో ఉంటారనే దానితోపాటు డిప్యూటీ మేయర్లుగా ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టీడీపీ ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరిస్తున్న పీలా శ్రీనివాస్‌ను 2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల సమయంలోనే మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. టీడీపీకి తక్కువ సీట్లు రావడంతో ఆయనకు ఫ్లోర్‌లీడర్ పదవిని అప్పగించారు. ఇప్పుడు కూటమికి మేయర్ పీఠం దక్కితే పీలా శ్రీనివాస్‌కే అవకాశం ఇస్తారని అంటున్నారు. అయితే బీసీ మహిళను మేయర్ పీఠం నుంచి దింపితే తిరిగి బీసీ మహిళకే పదవి కట్టబెట్టడం ద్వారా విమర్శలకు అవకాశం లేకుండా చేయవచ్చునని కొందరు కూటమి ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడుతున్నట్టు సమాచారం. మరోవైపు డిప్యూటీ మేయర్ పదవులు రెండు ఉండడంతో ఒకటి జనసేనకు, రెండోది టీడీపీకి కేటాయించే అవకాశం ఉంది. అయితే బీజేపీ కూడా డిప్యూటీ మేయర్ కోసం పోటీ పడితే పరిస్థితి రసవత్తరంగా మారే అవకాశం ఉంటుంది. జీవీఎంసీలో రాజకీయం వేడెక్కడంతో కౌన్సిల్‌లో ఏం జరుగుందనే దానిపై సర్వత్రా ఆసక్తి పెరిగిందని చెప్పుకోవాలి.

కైలాసగిరి అభివృద్ధికి ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

అర్థమయ్యాక పీపీపీలో జిప్‌లైనర్, స్కై సైకింగ్ ఏర్పాటుచేశారు. అలాగే గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం కూడా జరుగుతోంది. తెలుగు మ్యూజియానికి వెళ్లే మార్గం పూర్తికాలేదు. పార్కింగ్ సదుపాయాలు అదనంగా ఏర్పాటు చేయలేదు. కొన్ని సీసీ టీవీ కెమెరాలు పెట్టారు. అయితే ఉన్న వాటిలో చాలా వరకూ సరైన నిర్వహణ లేక మూలకుచేరుతున్నాయి. ఇటీవల సర్క్యులర్ రైలు తరచూ మొరాయిస్తుండడంతో పూర్తిగా నిలిపేశారు. రోప్‌వే వద్ద అగ్ని ప్రమాదం జరిగిందని తాత్కాలికంగా ఆపేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తెస్తేనే పునరుద్ధరిస్తామని స్పష్టంచేశారు. బ్యాటరీ కార్లకు అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారని వాటిని ఆపేశారు. ఇప్పుడు కైలాసగిరిపైకి ఎవరైనా వెళితే...380 ఎకరాలను కాలినడకనే తిరగాలి. ఎటువంటి వాహన సదుపాయం లేదు.

పాత ప్లాన్లకు కొత్త కలరింగ్

వీఎంఆర్‌డీఏ ఏదైనా మాస్టర్ ప్లాన్, ఇతర అభివృద్ధి పనులకు టెండర్లు పిలిస్తే గతంలో పనిచేసిన కన్సల్టెన్సీలు వారి వద్ద అప్పటికే ఉన్న సమాచారంతో కొత్త లెక్కలు వేసి లక్షలాది రూపాయలు కన్సల్టెన్సీ ఫీజులు కింద తీసుకుంటున్నాయి. లీ అసోసియేట్స్ వంటి సంస్థలను ఇక్కడి అధికారులు ఆపినా వారు అమరావతి వెళ్లి అక్కడి నుంచి చెప్పించుకొని కొనసాగుతున్నారు. ఇప్పుడు కూడా అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పాత డీపీఆర్‌ను ఒకసారి చూసి, అవసరమైన మార్పులు చేసుకొని ముందుకు వెళితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉక్కుపై కొరవడిన స్పష్టత

... 5వ పేజీ తరువాయి

సంస్థల బకాయిలు చెల్లించడానికి వినియోగిస్తున్నారు. ఉద్యోగులకు బకాయిపడిన జీతాల కోసం ఆ నిధులు ఉపయోగించడం లేదు. కార్మిక సంఘాలు ప్రశ్నిస్తే సీఎండీ సహా ఫైనాన్స్ విభాగంలో ఎవరూ నోరు విప్పడం లేదు. పైగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం, కాంట్రాక్టు కార్మికులను తొలగించడం ద్వారా అశాంతి వాతావరణం కొనసాగేలా చేస్తున్నారు. ఒకవైపు ఆర్థిక సాయం చేస్తూనే, మరోవైపు స్టీల్‌ప్లాంటును 100 శాతం విక్రయించే ప్రతిపాదన వెనక్కి తీసుకోలేదని ప్రకటనలు గుప్పిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు సీఎం రమేశ్, బాలశౌరి, మల్లు రవి వేర్వేరుగా ఇటీవల లోక్‌సభలో ప్రశ్నలు సంధించారు. స్టీల్‌ప్లాంటుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీని వినియోగించడానికి కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలు ఏమిటి?, ఉద్యోగులు, కార్మికులకు నెలలకొద్దీ జీతాలు ఇవ్వని విషయం వాస్తవమేనా?, అందించిన ప్యాకేజీ నుంచి జీతాలు చెల్లించే అవకాశం ఉందా?, వారికి ఉద్యోగ భద్రతపై తీసుకున్న చర్యలు ఏమిటి? అంటూ ప్రశ్నలు సంధించారు.

ఇదీ సమాధానం

ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ఉక్కు మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానాలు సూటిగా లేకపోవడం గమనార్హం. విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించామని, అందులో 10,300 కోట్లు ఈక్విటీగా మార్చామని, మరో రూ.1,140 కోట్లు వర్కింగ్ కేపిటల్ అని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ఉక్కు అమ్మకాల ద్వారా రూ.12,615 కోట్ల ఆదాయం వచ్చిందని, అప్పటికి రూ.3,943.43 కోట్ల నష్టం వచ్చిందని పేర్కొన్నారు. మొత్తం అప్పులు రూ.38,965 కోట్లకు చేరాయని వివరించారు. ఉద్యోగులకు సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలలకు కొంత జీతాలు చెల్లించామని, ఇంకా బకాయి ఉన్న మాట వాస్తవమేనన్నారు.

ప్యాకేజీలో జీతాలు లేనట్టే..

అందించిన ప్యాకేజీ నుంచి ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని చెప్పారా? లేదా? అన్న ప్రశ్నకు మంత్రిత్వ శాఖ సమాధానం ఇవ్వలేదు. అలాగే వారి ఉద్యోగ భద్రతకు తీసుకున్న చర్యలు ఏమిటి?...అనే దానిపైనా జవాబు లేదు. కానీ ఉద్యోగుల పనితీరు, పూర్తిస్థాయి ఉత్పత్తి వంటి లక్ష్యాలు ఇచ్చి, ప్లాంటు నష్టాల నుంచి బయటపడే చర్యలు తీసుకున్నామని, ఈ ఆర్థిక సాయం కొనసాగుతుందని తెలిపింది.



షీలానగర్ ఎస్‌టీబీఎల్ బాలాజీ దివ్యక్షేత్రంలో..

శ్రీవారి పాదాలను తాకిన సూర్యకిరణాలు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్‌టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం ఉదయం శ్రీవారి పాదాలను సూర్యకిరణాలు తాకడంతో అందరూ భక్తపరవశులయ్యారు. దివ్యక్షేత్రంలో శనివారం ఉదయం ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు వేంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకించాక భక్తులు తెచ్చిన పుష్పాలతో అలంకరించారు. ఉదయం ఆరున్నర సమయంలో సూర్యకిరణాలు శ్రీవారి పాదాలను తాకడంతో వేదపండితులతో పాటు భక్తులు కనులారా వీక్షించి తరించారు. సుమారు ఐదు నిమిషాల పాటు సూర్యకిరణాలు శ్రీవారి పాదాల చెంతే ఉండడంతో భక్తుల గోవింద నామస్మరణతో దివ్యక్షేత్రం మార్మోగింది. మధ్యాహ్నం ఎస్‌టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు ఆలయంలో అన్న సమారాధన చేపట్టారు.

జాబ్ మేళాలో 81 మంది ఎంపిక

పెందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 81 మంది ఎంపికయ్యారు. మేళాకు 172 మంది హాజరుకాగా డబ్ల్యుఎన్ఎస్‌లో 12 మంది, కాన్సెంట్రిక్స్‌లో ఏడుగురు, ఎంఆర్ఎఫ్, హ్యుందాయ్‌లో 15 మంది, ఫాక్స్‌కాన్‌లో 47 మంది ఎంపికయ్యారని కరస్పాండెంట్ టి.థియోఫిలస్ తెలిపారు. ప్రిన్సిపాల్ ఫ్లోరా, ప్లేస్‌మెంట్ అధికారి కమలారాణి పాల్గొన్నారు.

సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

మల్కాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 58వ వార్డు గుల్లలపాలెంలో శనివారం ప్రజా చైతన్యయాత్రను సీపీఎం నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో అనేక మంది ఇళ్ల కోసం దరావత్తులు కట్టినా ప్రభుత్వం ఇళ్లు నిర్మించలేదని తెలిపారు. 63వ వార్డు క్రాంతినగర్‌లోనూ నాయకులు ప్రజా చైతన్యయాత్ర చేపట్టారు. జోన్ నాయకులు బి.మమత, ఆర్.విమల, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కు శివాలయ వార్షికోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ లోపల గల పురాతన శివాలయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, రుద్ర హోమం నిర్వహించారు. ప్లాంటుకు మంచి రోజులు రావాలని, ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలని, నిర్వాసితులకు ఉపాధి లభించాలని కాంక్షిస్తూ పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాసరావు, కనకరెడ్డి, ధనరాజు, సురేంద్ర, శ్రీనివాస్, సుధాకర్‌శర్మ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 13, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)8, అల్లం (పాతది)50, బరబాటి 24, ముల్లంగి 22, మునక్కాడలు (కిలో) 28, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



మత్తు పదార్థాలకు బానిసకామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, తదితరులు

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని, యువత అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నగర పోలీసుల ఆధ్వర్యంలో నవ సమాజ నిర్మాణం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల జీవితాలు ఎలా పాడవుతాయి, యువత వీటికి దూరంగా ఉండడం వల్ల కలిగే మేలు వంటి అంశాలను ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీ మాట్లాడుతూ డ్రగ్స్ యువత జీవితాలను ఛిద్రం చేస్తాయన్నారు. డ్రగ్స్ వల్ల శరీరం, మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అందువల్ల విద్యార్థులందరూ ఇటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యావంతులు కూడా గత కొన్నాళ్లుగా సైబర్ నేరాలకు పాల్పడుతుండడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. పరిసరాల ప్రభావం కూడా విద్యార్థులు, యువతపై అధికంగా ఉంటుంది కాబట్టి డ్రగ్స్ వంటి వాటికి దూరంగా తమ పిల్లలు ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ జిందాల్, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, ప్రొఫెసర్ హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న గోపినాథ్ జెట్టి

గంజాయి రవాణాపై కఠిన చర్యలు

గంజాయి ప్రధాన సూత్రధారుల ఆస్తుల జప్తు

వీడియో కాన్ఫరెన్స్‌లో డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశాలు

విశాఖపట్నం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశించారు. విశాఖ రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, పోలీస్ ఉన్నతాధికారులతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంకల్పం కార్యక్రమంలో భాగంగా గంజాయి రవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. గంజాయి అక్రమ రవాణాలో ప్రధాన సూత్రదారులను గుర్తించి వారి ఆస్తులను త్వరతగతిన జప్తు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ కేసుల్లో ఉన్న నిందుతులను తక్షణమే గుర్తించి డిటెయిన్ చేయాలని సూచించారు. గంజాయి వినియోగదారులను గుర్తించి కౌన్సెలింగ్ చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రజల సహకారంతో సమగ్ర సమాచారం సేకరించాలని సూచించారు. ఇప్పటి వరకూ 296 మంది బాధితులను డీ-అడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే 24 కొత్త చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేసి వారిపై ఎన్బీడబ్ల్యూలను ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులను వేగవంతం చేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలన్నారు. గంజాయి పట్టుకున్న కేసుల్లో నార్కోటిక్స్ బ్యూరోకు రివార్డు కోసం అప్లై చేయాలన్నారు. పోక్సో కేసుల్లో బాధితులకు కలెక్టర్ల ద్వారా నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యల్లో భాగంగా శక్తి యాప్, శక్తిబృందాలను వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేసి, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధునిక సాంకేతికను ఉపయోగించి నేరాలను త్వరతగతిన ఛేదించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీలు తుహిన్‌సిన్హా, అమిత్ బర్దర్, వకుల్ జిందాల్, మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కూర్మన్నపాలెం,మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అఖిలపక్ష కార్మిక సంఘాల పర్యవేక్షణలో ఉద్యోగులు, కార్మికులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్‌లు మాట్లాడుతూ దీక్షలు చేపట్టి 1,500 రోజులైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవడంతో పాటు ఇకపై ఎవరిని విధుల నుండి తొలగించరాదని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులకు పూర్తి స్థాయిలో జీతాలు ఇవ్వడంతో పాటు బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు.

నాయకులు జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్లాంటును పరిరక్షించడంతో పాటు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు. ప్లాంటుకు మూడేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలన్నారు. ఇప్పటికైనా ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని పీఎం మోదీ ప్రకటించాలని పేర్కొన్నారు

కార్యక్రమంలో నాయకులు ఎన్.రామారావు, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, జె.రామకృష్ణ, డి.అప్పారావు, ఎస్.సింహాద్రి, పెంటారావు, సత్యారావు, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ కెవీ సతీశ్‌కుమార్ పోలీసు సిబ్బందిని హెచ్చరించారు. పెందుర్తి పోలీసు స్టేషన్‌లో శనివారం సిబ్బందితో సమావేశమయ్యారు. వేగంగా కేసులు దర్యాప్తు చేయడం, పెండింగ్ కేసులు పరిష్కరించడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. గంజాయి అక్రమ రవాణాపై నిరంతర నిఘా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై చర్యలు, జూద శిబిరాలపై దాడులు, అశ్లీల నృత్యాలకు అడ్డుకట్ట వేయడం, అసాంఘిక కార్యక్రమాల కట్టడికి శాఖాపరంగా తీసుకోవాల్సిన చర్యలను సీఐ వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తులపై తీసుకోవాల్సిన చర్యలను పేర్కొన్నారు. అక్రమ వ్యాపారులకు తోడ్పాటు అందిస్తే చర్యలు తప్పవని సీఐ సతీష్ కుమార్ హెచ్చరించారు. వైట్ కాలర్ నేరాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రజలతో మమేకమైతే సత్ఫలితాలు వస్తాయన్నారు. ఎస్ఐ, ఏఎస్ఐ పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికుల జోలికొస్తే సహించం'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల జోలికొస్తే సహించేది లేదని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ఎల్ఎంఎంఎం పార్కులో శనివారం సమావేశమైన పలువురు నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, నిత్యం అధైర్యంతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ టెండర్ పూర్తయిన తరువాత మళ్లీ పునరుద్ధరించకపోవడం వల్ల కాంట్రాక్టు కార్మికులకు పనిలేకుండా పోతుందన్నారు. కాంట్రాక్టు కార్మికులను ఇబ్బందులకు గురి చేసేలా యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మంత్రి రవి, వంశీకృష్ణ, అప్పారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేపై అవగాహన

అగనంపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేట్టిన పీ-4 సర్వేకు ప్రజలందరూ సహకరించవలసిందిగా స్థానిక కూటమి నాయకులు కోరారు. కొండయ్యవలస సీడబ్ల్యూసీలో పీ-4 సర్వేపై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ చేసి సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నేతలు ఇల్లపు ప్రసాద్, కర్రి దశేంద్ర, చందూరమేశ్, అచ్యుత్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నోడల్ అధికారిగా ఈపీఎస్ భాగ్యలక్ష్మి



మల్కాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా నోడల్ అధికారిగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఈపీఎస్ భాగ్యలక్ష్మిని నియమిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు ఆమె ఎయిడ్స్ ప్రోగ్రామ్ జిల్లా సమన్వయకర్తగా, రెడ్ రిబ్బన్ క్లబ్స్ జిల్లా సమన్వయకర్తగా, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారిగా వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె సేవలు మరింత అవసరమని భావించి నోడల్ అధికారిణిగా నియమించారు. సేవా కార్యక్రమాల్లో యువతను, ఉన్నత విద్యాసంస్థలను భాగస్వాములను చేస్తానని ఆమె తెలిపారు. ఆమెను ఏయూ జాతీయ సేవ పథకం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్, ఇతర జిల్లా నోడల్ అధికారులు, సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, వాలంటీర్లు, సామాజిక కార్యకర్తలు అభినందించారు.

గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

పెందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో పెందుర్తిలోని టీటీడీసీలో శనివారం వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో కృషి సంవర్ధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, పంట కోత అనంతరం శాస్త్రీయ పద్ధతిలో నిల్వ, నష్టాలను తగ్గించడం వంటి అంశాలపై వక్తలు రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ గిడ్డంగుల ప్రయోజనాలు, బ్యాంకు రుణ సదుపాయాలు, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర గిడ్డంగుల మేనేజర్ పి.శ్యామ్‌సుందర్‌బాబు విత్తనాలను రైతులకు అందజేశారు. మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, సాంకేతిక సిబ్బంది డార్విన్, మజ్జి సూర్యకుమారి పాల్గొన్నారు.

వర్కర్స్ ఎడ్యుకేషన్ మండలి' సభ్యులుగా ఉక్కు ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వర్కర్స్ ఎడ్యుకేషన్ బోర్డు మినిస్ట్రీ ఆఫ్ లేబర్ ప్రాంతీయ సలహా మండలి సభ్యులుగా ఉక్కు ఉద్యోగులు కొమ్మినేని శ్రీనివాసరావు, లాలం ప్రసాద్‌లు నియమితులయ్యారు. కార్మికులకు కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలు, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

భూగర్భ జలాల వృద్ధికి కృషి: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, మార్చి 22 (ఆంధ్ర జ్యోతి): వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం ఎస్ఆర్‌పురంలోని భూగర్భ జలాల వృద్ధి కోసం ఉపాధి నిధులతో నిర్మించనున్న నీటికుంట (ఫామ్‌పాండ్)కు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ జలమే జీవనాధారం అన్నారు. మండలంలో 500 నీటికుంటలు ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. అనంతరం ఉపాధి మహిళా కూలీలతో ఎమ్మెల్యే ముచ్చటించారు. ఉపాధి పనుల మట్టి తట్టను ఎత్తారు. సర్పంచ్ దూది విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కొల్లి వెంకటరావు, ఏపీవో గోవిందరావు, గొరపల్లి సోమునాయుడు, కాగిత ఎర్రిబాబు, దూది శివ, వై.రమణ పాల్గొన్నారు.



ఉపాధి కూలీకి మట్టి తట్ట ఎత్తుతున్న పంచకర్ల

నీటి పొదుపుతోనే భవిష్యత్తు: స్టీల్‌ప్లాంట్ సీజీఎం

ఉక్కుటౌన్‌షిప్: నీటి పొదుపుతోనే భవిష్యత్తు ఉందని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి అన్నారు. స్టీల్‌ప్లాంటులో నిర్వహించిన నీటి దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీటిని అందరూ ఎంతో పొదుపుగా వాడాలన్నారు. ఉక్కు పరిశ్రమల్లో నీటి వినియోగం చాలా ఎక్కువగా ఉంటుందని, నీటిని పొదుపుగా వాడుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. అనంతరం పలువురు ఉద్యోగులకు ఆయన అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, కార్మికులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా పాత గాజువాకలోని సీఎంఆర్ సెంట్రల్ వద్ద నీటి పొదుపుపై విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేపట్టారు.

తిరుమల నగర్‌లో జల దినోత్సవ ర్యాలీ

కూర్మన్నపాలెం: నీరే ప్రాణాధారమని, భావి తరాల నీటి బ్యాంకులే ఇంకుడు గుంతలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, విశ్వేశ్వరరావులు పేర్కొన్నారు. 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో శనివారం ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని కాలనీలో నూతన ఇంకుడు గుంతలను తవ్వారు. భూగర్భ జలాల పెంపుదలే లక్ష్యంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తూ శానిటరీ సిబ్బంది, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సీహెచ్ రాధాకృష్ణ, పరమేశ్వరరావు, సన్యాసిరావు, పీఎస్ఎన్ రెడ్డి, వసంతరెడ్డి, మల్లికార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆర్‌వోబీని నిర్మించాలి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి దువ్వాడకు వెళ్లే రహదారిలో నిర్మిస్తున్న రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) వల్ల తుంగ్లాం, చుక్కవానిపాలెం, పరిసర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలని ఐలా, ఆర్అండ్‌బీ అధికారులను 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కోరారు. శనివారం ఐలా కార్యాలయంలో కమిషనర్ కిశోర్, ఆర్అండ్‌బీ ఏఈఈ నరసింహమూర్తి, తదితరులతో ఆయన సమావేశమై కాలనీల సమస్యను వివరించారు. ఆర్‌వోబీ ప్రస్తుత ప్లాన్‌లో ఉన్న రక్షణ గోడ నిర్మాణం వల్ల హైవే నుంచి షీలానగర్ మీదుగా ఆటోనగర్‌కు ఉన్న 60 అడుగుల రహదారి, ఆటోనగర్ నుంచి తుంగ్లాంకు ఆనుకొని దువ్వాడకు వెళ్లే ప్రస్తుత రహదారి నుంచి తుంగ్లాం, చుక్కవానిపాలెం పరిసర కాలనీ ప్రజల రాకపోకలు మూతపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చుక్కవానిపాలెం వద్ద సర్వీస్ రోడ్లు ఉండేలా ఆర్‌వోబి నిర్మిస్తేనే ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

శిశు సంక్షేమ కమిటీ ఏర్పాటుపై చర్చ

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో శనివారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ పర్యటించారు. సచివాలయంలో శిశు సంక్షేమ కమిటీ ఏర్పాటుపై సభ్యులతో చర్చించారు. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువల పనులను పరిశీలించారు. కాలనీల్లో వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పైడిరాజు, మాణిక్యం, పట్నాయక్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ పరిశుభ్రత పాటించాలి

అగనంపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కోరారు. వార్డు పరిధిలోని శనివాడలో స్థానిక యువకులతో కలిసి శనివారం శ్రమదానం చేశారు. ప్రధాన రహదారులతో పాటు వీధులను చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఇళ్ల మధ్య, రోడ్లపై వేయరాదని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గల్లా రుద్రకుమార్, ఎం.వెంకటరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కిలోన్నర గంజాయి, గ్రాము ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం

ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన దువ్వాడ పోలీసులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలోని మంగళపాలెం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఒక కిలో 545 గ్రాముల గంజాయి, ఒక గ్రాము ఎండీఎంఏ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళపాలేనికి చెందిన పాత రౌడీ షీటర్ కె.వెంకట మహేశ్, వడ్లపూడిలోని సిద్ధార్థనగర్‌కు చెందిన పాత నేరస్థుడైన కుప్పిళ్ల వర్ధన్, వడ్లపూడికి చెందిన ఆటోడ్రైవర్ వనపల్లి మహేశ్‌లు నంబర్ ప్లేటు లేని పల్సర్ బైకుపై వస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వీరి వద్ద నుంచి ఒక కిలో 545 గ్రాముల గంజాయి, ఒక గ్రాము ఎండీఎంఏ డ్రగ్, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వీరు అరకులో, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా గుంత కుముడు వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి బెంగళూరులోని భాయ్ అనే వ్యక్తికి ఎక్కువ రేటుకు విక్రయిస్తుంటారు. అంతేకాక భాయ్ వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను తక్కువ రేటుకు కొనుగోలు చేసి విశాఖ నగరంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల వద్ద నుంచి సరకుతో పాటు బైకు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. గంజాయి తాగినా, ఎవరైనా అమ్మినా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

త్వరలో నాయకులకు నామినేటెడ్ పోస్టులు

బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భారతీయ పార్టీ కోసం శ్రమించిన నాయకులకు త్వరలోనే నామినేటెడ్ పోస్టులు వస్తాయని గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాజువాకలో ఆశావహుల జాబితాను తయారుచేసి పార్టీ పెద్దలకు అందజేస్తామన్నారు. పార్టీ కోసం కష్టించిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. గాజువాకలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. సమావేశంలో నాయకులు బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, భువనేశ్వరి, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు నేడు అంతరాయం

అగనంపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 77, 79 వార్డుల పరిధిలో ఆదివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ వాటర్ సప్లై విభాగం ఏఈ పి.కేదార్‌నాథ్ తెలిపారు. ఏలేరు కాలువ వద్ద ప్రధాన పైపు లైన్‌కు మరమ్మతులు చేపట్టనున్నామని, ఈ కారణంగా లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, దేవాడ, పరవాడ హౌసింగ్ కాలనీ, అప్పికొండ, మదీనాబాగ్ ప్రాంతాలకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

గాజువాకలో మెడికల్ షాప్ సీజ్

గాజువాక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం మెడికల్ షాప్‌లపై డ్రగ్స్ టీమ్‌లు నిర్వహించిన దాడుల్లో భాగంగా గాజువాక సినిమా హాల్ జంక్షన్‌లో గల శ్రీసాయి వెంకటేశ్వర మెడికల్ స్టోర్స్‌ను సీజ్ చేశారు. ఈ స్టోర్స్‌లో నిర్వహించిన దాడుల్లో సుమారు రూ.90 వేల విలువైన 41 రకాల ఎక్స్‌పైర్ అయిన డ్రగ్స్ ఉన్నట్టు గుర్తించామని విశాఖపట్నం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ ఎత్తున ఎక్స్‌పైర్ అయిన మందులు ఉన్న విషయాన్ని గాజువాక కోర్టుకు సమాచారం అందించామని ఆమె పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

సింధియా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 62వ వార్డు పరిధి అచ్చినాయుడుతోటకు చెందిన పలువురికి సీఎం సహాయక నిధి చెక్కులను పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం పంపిణీ చేశారు. అనంతరం గణబాబు మాట్లాడుతూ ప్రజలందరికీ కొండంత అండగా చంద్రన్న ప్రభుత్వం అన్నివేళలా సహాయం చేస్తుందన్నారు. అనారోగ్య పీడితులు, పేదలకు సీఎం సహాయ నిధి అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముత్యమాంబ అలంకరణ కొబ్బరికాయల పంపిణీ

వేపగుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేపగుంట పరిసర ప్రాంతాల ఆరాధ్యదేవత ముత్యాలమ్మ పండుగ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన రంగుల కొబ్బరి కాయలను శనివారం తొలగించి వాటిని భక్తులకు అందజేశారు. దాదాపు 70 వేల కొబ్బరి కాయలను భక్తులకు ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య అందజేశారు. సాయంత్రం కృష్ణరాయపురం వాసి అన్నపూర్ణదేవి వట్టివేళ్లతో దండను తయారుచేసి అమ్మవారి అలంకరణకు ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

క్రైం... crime news

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

» భీమిలి పోలీస్ స్టేషన్ ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన


భీమిలి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న గ్రామస్థులు


మృతురాలు రాజేశ్వరి

భీమునిపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని గొల్లలపాలెంలో ఓ వివాహిత వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం.. పీతల రాజేశ్వరి (28)కి వెంకటరమణతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కుమారుడు, కుమార్తె. కుమారుడు చైతన్య (11) 5వ తరగతి, కుమార్తె వర్షిణి (8) రెండవ తరగతి చదువుతున్నారు. వెంకట రమణ చిన్నబజారులో ముఠా కార్మికుడిగా పని చేస్తుండగా, రాజేశ్వరి నగరంలోని ప్రైవేటు సంస్థలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 20న రాజేశ్వరి సెల్ నుంచి వారి ఇంటికి సమీపంలో ఉంటున్న గుడ్డాల ఉజ్వల భర్త సురేశ్‌కు కాల్ వెళ్లింది. ఆ సమయంలో ఆయన ఇంట్లో తన భార్య పక్కనే వున్నారు. ఆ ఫోన్‌ను ఉజ్వల తీసుకుని నువ్వెందుకు మా ఆయనకు ఫోన్ చేశావని ప్రశ్నిస్తుండగానే రాజేశ్వరి కాల్ కట్ చేసింది. తర్వాత ఆమె పలుమార్లు కాల్ చేసినా తీయలేదు. దీంతో ఉజ్వల, రాజేశ్వరి ఇంటికి సమీపంలో ఉన్న బంధువు తోటమ్మకు ఫోన్ చేసి, రాజేశ్వరికి ఇవ్వమంది. ఫోన్‌లో ఇష్టానుసారం అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు రాజేశ్వరి మరిదికి కూడా ఫోన్ చేసి, మీ వదిన పదే పదే మా ఆయనకు ఫోన్ చేసి మాట్లాడుతుందని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించింది. శుక్రవారం మధ్యాహ్నం రాజేశ్వరి, ఉజ్వలకు ఫోన్ చేసి తప్పయిపోయిందని, క్షమించమని ప్రాధేయపడింది. కానీ ఆమె వినకపోవడంతో గొడవ పెద్దదయ్యే అవకాశం ఉందని భయపడి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాజేశ్వరి మృతికి ఉజ్వల మానసిక వేధింపులే కారణమని వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదే రోజు రాత్రి పోలీసులు నిందితురాలి ఇంటికి వెళ్లారు. ఉజ్వల ఎనిమిది నెలల గర్భిణి కావడంతో అదుపులోకి తీసుకోలేకపోయారు. కాగా శనివారం తెల్లవారుజామున మృతురాలి బంధువులు, గ్రామస్థులు, సీఐటీయూ నాయకులు పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళన చేశారు. దీంతో పోలీసులు ఉజ్వల, ఆమె భర్త సురేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో ఎస్ఐ గౌరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని నుంచి రూ.50 వేల విలువైన పది కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు తమ సిబ్బందితో శనివారం ప్లాట్‌ఫారాలపై తనిఖీ చేస్తుండగా తమిళనాడుకు చెందిన మహ్మద్ అబ్బాస్ అనే వ్యక్తి చెన్నైకు గంజాయి రవాణా చేస్తూ దొరికిపోయాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఆరుగురి అరెస్టు

మహారాణిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లాడ్జిలో 31.5 కేజీల గంజాయిని పట్టుకొని మహారాష్ట్రకు చెందిన ఆరుగురిని అరెస్టు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. భూపేష్ నగర్‌లోని శ్రీలక్ష్మి లాడ్జిపై దాడి చేసిన పోలీసులకు 31.5 కేజీల గంజాయి దొరికింది. ఒడిశాలోని జైపూర్‌లో కొనుగోలుచేసి మహారాష్ట్ర తీసుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న గణేష్ రాజారామ్ పాగర్, షమీమ్ హబీబ్ షేక్, అజయ్ శ్యామ్ షిండే, మధుకర్ క్రే, ఎస్ఎస్ మంగేష్, రూపేష్ గైక్వాడ్‌లను అదుపులోకి తీసుకున్నారు మహారాష్ట్రకు చెందిన వీరు నేరం అంగీకరించటంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఏడుగురికి కారుణ్య నియామకాలు


ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో కలెక్టర్, ఆర్టీసీ ఆర్ఎం, తదితరులు

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఏడుగురికి వివిధ శాఖల్లో ఉద్యోగాలు కల్పిస్తూ శనివారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తమ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని వివిధ డిపోల్లో ఆర్టీసీ ఉద్యోగులుగా పనిచేస్తూ పలువురు మృతి చెందారు. తమకు కారుణ్య నిమామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ మృతుల వారసులు సంబంధిత అధికారులకు, కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఆ దరఖాస్తులను పరిశీలించాక ఏడుగురిని అర్హులుగా గుర్తించి వివిధ శాఖల్లో ఉద్యోగాలు కల్పించింది. మిగిలిన వారికి కూడా త్వరలో ఉద్యోగాలు కల్పిస్తామమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఆర్టీసీ విశాఖ రీజియన్ పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో క్షయకు చెక్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గితే 'క్షయ' వ్యాధి వస్తుంది. టీబీ రహిత సమాజం కోసం గడిచిన కొన్నాళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నప్పటికీ సాధ్యం కావడం లేదు. ఏటా భారీ సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ఒక్కోసారి ప్రాణాలను కూడా హరిస్తుంది. సకాలంలో గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే ఆరు నెలల్లోనే పూర్తిగా ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు అవకాశం ఉంది. ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతోనే ఏటా మార్చి 24న అంతర్జాతీయ క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అందిస్తున్న ప్రత్యేక కథనం...

లక్షణాలు కనిపిస్తే పరీక్షలు తప్పనిసరి

» వ్యాధి బారినపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం

» రేపు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

1882వ సంవత్సరంలో క్షయ వ్యాధికారక క్రిమిని డాక్టర్ రాబర్ట్ కాక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు. గత కొన్నేళ్లలో వైద్య రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు క్షయను సంపూర్ణంగా నయంచేసేందుకు అవసరమైన మందులను అందుబాటులోకి తెచ్చాయి. క్షయ నిర్ధారణ పరీక్షలతోపాటు మందులు కూడా ప్రజలకు చేరువ కావడంతో మరణాలు గణనీయంగా తగ్గాయి. రోగాన్ని నయం చేయడం కంటే ముందు దానిపై స్పష్టమైన అవగాహన కలిగించడం ఎక్కువ ఫలితాన్నిస్తుంది.

వ్యాధికి కారణం ఇది

మైక్రో బాక్టీరియం అనే క్రిమి వల్ల ట్యూబర్ క్యులోసిస్ అనే శాస్త్రీయ నామంతో పిలిచే క్షయ వ్యాధి వ్యాపిస్తుంది. ప్రతి లక్ష మందిలో 206 మంది క్షయ వ్యాధి బారిన పడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. విశాఖపట్నం జిల్లాలో ప్రస్తుతం 1,446 యాక్టివ్ కేసులు ఉన్నాయి. గడిచిన ఏడాది జిల్లాలో 4600 మందికి క్షయ సోకింది. ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం ద్వారా పూర్తిగా క్షయ నుంచి కోలుకునే అవకాశం ఉండడంతో యాక్టివ్ కేసుల సంఖ్య తగ్గుతోంది.

నాలుగు కేటగిరీలు

క్షయ వ్యాధిని నాలుగు కేటగిరీలుగా విభజిస్తారు. మొదటిసారి క్షయ వ్యాధి సోకినట్టయితే కేటగిరీ-1గా భావిస్తారు. ఈ కేటగిరీలో ఉన్న వారికి ఆరు



నెలలపాటు మందులు అందిస్తారు. పాతవారికి మళ్లీ టీబీ సోకినట్టు గుర్తిస్తే వారిని కేటగిరీ-2గా భావిస్తారు. వీరికి ఎనిమిది నెలలపాటు మందులు అందిస్తారు. కేటగిరీ-3 బారినపడే వారిని మొండి క్షయ వ్యాధి గ్రస్తులు (ఎండీఆర్), కేటగిరీ-4ను ముదిరిపోయిన వ్యాధి గ్రస్తులు (ఎక్స్‌డీఆర్)గా పరిగణిస్తారు. వీరికి తొమ్మిది నుంచి 24 నెలలపాటు మందులు అందిస్తారు. 24 నెలలపాటు మందులు వాడాల్సిన వారిని తీవ్రమైన కేసులుగా పరిగణిస్తారు. వీరికి సుమారు రూ.18 లక్షల విలువైన మందులను ఉచితంగా ప్రభుత్వం అందిస్తూ కోలుకునేలా చేస్తోంది.

అంటు వ్యాధి..

క్షయ అంటు వ్యాధి. ఇది దగ్గు ద్వారా ఇతరులకు వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఇంట్లో టీబీతో బాధపడేవారికి మిగిలిన కుటుంబ సభ్యులు కొంత దూరంగా ఉండాలి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే రోగులు, చిన్నారులను టీబీ వ్యాధి గ్రస్తులను దూరంగా ఉంచడం ద్వారా వ్యాధి బారినపడకుండా కాపాడవచ్చు.

ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం..

టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించే క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్ల రూ.500 చొప్పున, ప్రైవేటు వైద్యులు గుర్తిస్తే వారికి వేయి చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. వ్యాధితో బాధపడే రోగులకు పోషకాహారం కోసం నెలకు రూ.1000 చొప్పున ప్రభుత్వాలు అందిస్తున్నాయి. అలాగే, నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ విశాఖ జిల్లాకు రూ.33 లక్షల రూపాయలు అందించింది. ఈ మొత్తంతో పోషకాలతో కూడిన కిట్లను 770 మందికి రెండేళ్లపాటు ఇవ్వనున్నారు.

ఇవీ లక్షణాలు..

టీబీ వ్యాధికి గురిచేసే వైరస్ ఊపిరితిత్తుల్లో నివసిస్తుంది. పోషకాహార లోపంతో బాధపడేవారికి, వెంటిలేషన్ సరిగా లేని ఇళ్లల్లో ఉండే వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి, షుగర్ బాధితులకు, హెచ్ఐవీ బాధితులకు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి ఈ వ్యాధి అధికంగా వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి బారినపడిన వారిలో ఎడతెరిపి లేని దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, సాయంత్రం వేళ జ్వరం రావడం, నీరసం, బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి, ఆయాసం అధికంగా ఉండడం, ఆకలి మందగించడం, కఫం పడినప్పుడు రక్తపు జీరలు పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీరికి మైక్రోస్కోపీ, ఆర్‌పీసీఆర్, సీబీ నాట్ పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారిస్తారు.





వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నాం

- డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి



టీబీ వ్యాధి పట్ల అవగాహన చాలా అవసరం. ప్రజలకు ఈ వ్యాధి పట్ల అవగాహన ఉన్నప్పుడే నియంత్రించడం సాధ్యపడుతుంది. ముఖ్యంగా షుగర్ బాధితులు, 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, పొగ తాగే అలవాటు ఉన్న వాళ్లు, గుట్కా/పాన్ తినేవారికి పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తున్నాం. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అన్ని రకాల మందులు ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి బారినపడినవారు ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం ద్వారా పూర్తిగా కోలుకోవచ్చు.

టీ20 పోరుకు ఇరు జట్ల ఆటగాళ్ల ముమ్మర సాధన

» ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్


సాధనలో నిమగ్నమైన ఇరు జట్ల క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఐపీఎల్ సందడి నెలకొంది. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య శనివారం ఐపీఎల్ తొలి మ్యాచ్ జరిగిన నేపథ్యంలో నగరంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య సోమవారం జరిగే మ్యాచ్‌పై క్రీడాభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని తొలి రెండు మ్యాచ్‌లకు హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు నాలుగు రోజుల క్రితమే నగరానికి చేరుకున్నారు. ఈ సీజన్‌లో తొలిమ్యాచ్ ఆడనున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఆటగాళ్లు శుక్రవారం నగరానికి చేరుకున్న సంగతి తెలిసిందే. ఇరు జట్ల ఆటగాళ్లు శనివారం మధ్యాహ్నం నుంచి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ముమ్మరంగా సాధన చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్‌లోని కీలక క్రికెటర్ కె.ఎల్.రాహుల్ శనివారం జట్టులో చేరి బ్యాటింగ్ సాధన చేశాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌తోపాటు డేవిడ్ మిల్లర్, మార్క్‌రమ్, అర్యన్ జుయల్, హిమత్ సింగ్, మాథ్యూ, నికోలాస్ పూరన్, మిశ్చల్ మార్ష్, అబ్దుల్ సమద్, షెహబజ్ అహ్మద్, యువరాజ్ చౌదరి, రాజవర్ధన్, అర్షిన్ కులకర్ణి, ఆయుష్ బదోని, అవేష్ ఖాన్, ఆకాష్ దీప్, సిద్దార్థ్, డిగ్వేష్ సింగ్, ఆకాష్ సింగ్, మయాంక్ యాదవ్, మోషిన్ ఖాన్, రవి బిష్ణోయి, ప్రిన్స్ యాదవ్, షమర్ జోసఫ్ శనివారం సాధనలో పాల్గొన్నారు.

వేద విద్యలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాదిపాడులోని వేద వేదాంత గురుకుల మహా విద్యాలయంలో వేద విద్యలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విద్యాలయం ధర్మాధికారి ప్రొఫెసర్ డీవీఆర్ శేషాద్రి శనివారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆసక్తి గలవారు 99630 67025 సెల్ నంబర్‌కు వాట్సాప్ సందేశం పంపి పూర్తి సమాచారాన్ని పొందవలసిందిగా ఆయన సూచించారు. అదే నంబర్ వాట్సాప్ నంబర్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని శేషాద్రి తెలిపారు. కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం, రుగ్వేదం లోని కొన్ని భాగాలకు సంబంధించిన విద్య అందుబాటులో ఉంటుందన్నారు. శ్రీశృంగేరి శారదాపీఠం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పరిశ్రమల్లో భద్రతకు పెద్దపీట వేయాలి

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలని, తరచూ మాక్‌డ్రిల్స్ నిర్వహించి కార్మికులు, ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులు, పరిశ్రమల నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పరిశ్రమల్లో పనిచేసే సిబ్బందికి ప్రమాదాల నుంచి తప్పించుకోవడం ఎలా అనే అంశంపై శిక్షణ ఇప్పించాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా క్రైసెస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా కంపెనీల్లో పనిచేసే సిబ్బందికి, కార్మికులకు తప్పనిసరిగా బీమా సదుపాయం కల్పించాలన్నారు. ప్రాణ నష్టం లేకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పాటించాలని, అన్నిచోట్లా ఆటోమెటిక్ అలారం సిస్టమ్స్ ఉండాలని పరిశ్రమల నిర్వాహకులకు ఆదేశించారు. కార్మికులకు అన్ని రకాల వసతులను కల్పించాలని, పర్యావరణ హిత విధానాలకు ప్రాధాన్యతనివ్వాలని, సూచించారు. అన్నిచోట్లా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్మికులు, ప్రజల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఫ్యాక్టరీల చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, డీఎఫ్‌వో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ అమానత్'తో ఆభరణాల సంచి గుర్తింపు

» గంటల వ్యవధిలోనే స్వాధీనం

» పోగొట్టుకున్న ప్రయాణికుడికి అప్పగింత


బంగారు ఆభరణాలను బాధితునికి అప్పగిస్తున్న సింహాచలం ఆర్పీఎఫ్ సిబ్బంది

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైల్ మదత్ (ఆన్‌లైన్ వ్యవస్థ) ఫిర్యాదుపై మర్రిపాలెం పోస్టు ఆర్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తమై 'ఆపరేషన్ అమానత్' (సత్వరం స్పందించే విభాగం) చర్యలు చేపట్టడంతో బాధితుడు పోగొట్టుకున్న బంగారు ఆభరణాలతో కూడిన సంచిని గంటల వ్యవధిలోనే చేజిక్కించుకున్నారు. ఆర్పీఎఫ్ తెలిపిన సమాచారం మేరకు... విజయనగరం జిల్లా బడేవలస గ్రామానికి చెందిన బి.రాంబాబు (28) అనే ప్రయాణికుడు ఈ నెల 20న సింహాచలం నుంచి బొబ్బిలి వెళ్లేందుకు బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలును అందుకునే తొందరపాటులో సుమారు రూ.2.83 లక్షల విలువైన 33 గ్రాముల బంగారు ఆభరణాలతో కూడిన సంచిని స్టేషన్‌లో మరిచిపోయాడు. మార్గంమధ్యలో ఆభరణాల సంచి మరచిన సంగతిని గుర్తించి వెంటనే రైల్ మదత్ ద్వారా ఫిర్యాదు చేశాడు. వాల్తేరు రైల్వే ప్రధాన ఆర్పీఎఫ్ కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు అందుకున్న సిబ్బంది వెంటనే సింహాచలం ఆర్పీఎఫ్ పోస్టుకు సమాచారమిచ్చారు. విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ జె.డిల్లి హుటాహుటిన స్టేషన్‌లో గాలించి ఆభరణాలతో కూడిన సంచిని గుర్తించి స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం అధికారుల ఆదేశాల మేరకు బాధితునికి సమాచారమిచ్చారు. మర్రిపాలెం పోస్టుకు వచ్చిన బాధితుడిని పూర్తిస్థాయిలో విచారించారు. సంచిలో ఉన్న నెక్లెస్, చెవిపోగులు, చైన్ తదితర 33 గ్రాముల బంగారు ఆభరణాలు బాధితుడివేనని తగిన ఆధారాలతో నిర్ధారించుకున్న తర్వాత నిబంధనల ప్రకారం వాటిని అప్పగించారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి, నిజాయతీ చూపడమే కాకుండా ఫిర్యాదుపై క్షణాల్లో ప్రతిస్పందించిన సింహాచలం పోస్టు సిబ్బంది పనితీరుపై సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్, ఇతర అధికారులు హర్షం వ్యక్తం చేశారు.